మా కలం.. మీ గళం..
RNI : APTEL/ 2017/74310
# మన గళం
దిన పత్రిక
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 154 | బుధవారం | 26 - 11 - 2025 | పేజీలు: 8 | వెల: 4

## ప్రజా సమస్యలు పరిష్కరించాలి



3లో..




## రాయలసీమలో ఉద్యాన పంటలకు
# నూతన దిశ

- పండ్ల తోటల విస్తరణపై కీలక ఆదేశాలు
- 92 క్లస్టర్లతో హార్టికల్చర్ ప్రోత్సాహం
- 5.98 లక్షల మంది రైతులకు ప్రభుత్వ నూతన కార్యాచరణ

మన గళం, అమరావతి : రాయలసీమలో పండ్ల తోటల పెంపకం, సాగు సబ్సిడీలు, మార్కెటింగ్ సదుపాయాలు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల అభివృద్ధి వంటి అంశాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్వోదయ పథకంలో రాయలసీమను ఉద్యాన పంటల హబ్‌గా తీర్చిదిద్దే మార్గంపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో రాయలసీమ మరియు ప్రకాశం జిల్లాల్లో మొత్తం 92 క్లస్టర్ల ద్వారా హార్టికల్చర్ సాగును బలపర్చేలా కార్యాచరణ రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రాంతీయ ప్రత్యేకతకు అనుగుణంగా పంటల ఎంపిక, నీటి వనరుల వినియోగం, అవసరమైన సాంకేతిక సహాయం వంటి అంశాలపై అధికారులను దిశానిర్దేశం చేశారు. పండ్ల తోటల అభివృద్ధి ద్వారా రైతుల ఆదాయాన్ని స్థిరీకరించడం, మార్కెటింగ్ వ్యవస్థలను పారదర్శకంగా మార్చడం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను సమీప జిల్లాల్లో స్థాపించడం వంటి చర్యలు ప్రభుత్వం చేపట్టాలని సీఎం సూచించారు.



రాయలసీమలోని పండ్లతోటల రైతుల ఆదాయం గణనీయంగా పెరగాలంటే సమగ్ర ప్రణాళిక తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు. ఉద్యాన శాఖ తాజా లెక్కల ప్రకారం, రాయలసీమ ప్రాంతంలో మొత్తం 5.98 లక్షల మంది ఉద్యాన రైతులు ఉన్నారు. వారికి మరింత లబ్ధి చేకూరేలా ప్రత్యేక పథకాలు రూపొందించాల్సిన అవసరాన్ని సీఎం ఈ సందర్భంగా స్పష్టంగా తెలిపారు. సమీక్ష సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ఈ నెల 30న అఖిలపక్ష భేటీ

**శీతాకాల సమావేశాలకు కేంద్రం సిద్ధత**
**సక్రమంగా సభ సాగేందుకు ముందస్తు చర్చలు**
**ఎన్నికల జాబితా సవరణపై ప్రతిపక్ష ఆందోళనలు**

మన గళం, న్యూఢిల్లీ : డిసెంబర్ 1 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ శీతాకాల సమావేశాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చింది. ఈనెల 30న నిర్వహించనున్న ఈ సమావేశాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఏర్పాటు చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. సభ సజావుగా నడవడానికి, ముఖ్యమైన చట్టాలు మరియు ప్రజా సమస్యలపై ముందస్తు చర్చలు జరగనున్నాయి. 2 లో..

## బుర్హాన్ వనీ హత్యకు
# ప్రతీకారం



**15 ప్రాణాలను బలిగొన్న ఉమర్ ఉన్ నబీ కథ**
**ఎర్రకోట వద్ద జరిగిన ఆత్మాహుతి దాడి వివరాలు వెలుగులోకి**
**తొమ్మిది భాషల్లో నైపుణ్యం కలిగిన ఉగ్రవాది**
**'అమీర్'గా తనను తాను పిలిపించుకున్న ఉమర్ ప్రభావం**

మన గళం, న్యూఢిల్లీ : రాజధాని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు దాడి కేసులో సంచలన సమాచారాలు వెలుగులోకి వచ్చాయి. ఈ దాడికి పాల్పడి 15 మంది ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాది ఉమర్ ఉన్ నబీ తనను తాను 'అమీర్' అని పిలిపించుకునేవాడని విచారణలో బయటపడింది. అతడిని ఓ పాలకుడిగా భావించి మిగతా సభ్యులు అతని ఆదేశాలకే లోబడే వారు. హర్యానాలోని ఫరీదాబాద్ ప్రాంతంలో 2 లో..

## బాధ్యతలు కూడా
# గుర్తుంచుకోండి




**నైతిక విలువలు, నాణ్యమైన విద్యపై ప్రభుత్వ దృష్టి**

మన గళం, మంగళగిరి : రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి తరచూ మాట్లాడుతారుగాని, బాధ్యతలను కూడా అంతే ప్రాముఖ్యతతో ఆలోచించాల్సిన అవసరం ఉంద ని రాష్ట్ర విద్య, సమాచార సాంకేతిక శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళగిరి మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని కూర్మాల శ్రీ 2 లో..

## కాల్వబుగ్గ బస్ స్టాప్ ఏర్పాటు చేయించండి

**- ఎంపీ బైరెడ్డి శబరికి వీహెచ్ పీ నాయకుల వినతి**



మనగళం, కర్నూలు సిటీ : ప్రముఖ కాల్వబుగ్గ పుణ్యక్షేత్రం వద్ద ఆర్టీసీ బస్సులు తప్పనిసరిగా ఆగేలా చర్యలు తీసుకోవాలని, బస్ స్టాప్ ఏర్పాటు చేయించాలని కోరుతూ నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యంత పవిత్రమైన కాల్వబుగ్గ క్షేత్రానికి వేలాది భక్తులు దర్శనం కోసం వస్తుంటారని, ఆర్టీసీ బస్సులు చాలా తక్కువ సంఖ్యలో మాత్రమే ఆగడం వలన మహిళలు-వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నాయకులు ఎంపీకి తెలిపారు. స్పందించిన ఎంపీ బైరెడ్డి శబరి వెంటనే నంద్యాల, కర్నూలు జిల్లాల ఆర్టీసీ ఆర్ఎం అధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. భక్తుల సౌకర్యార్థం బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్టీసీ అధికారులు వెంటనే సానుకూలంగా స్పందించి, అన్ని విధానపరమైన చర్యలు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా కాల్వబుగ్గ పుణ్యక్షేత్రం వద్ద స్థిరమైన బస్టాండ్ నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి నిధులు కేటాయిస్తామని బైరెడ్డి శబరి ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ విశేష సంపర్క రాష్ట్ర ప్రముక్ టి. ప్రతాపరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గోవిందరాజులు, నాయకులు రవీంద్ర గౌడ్, సంగు రాంబాబు, శివపురం నాగరాజు, బజరంగ్ దళ్ నాయకులు తెలుగు భగీరథ, శివ సాయినాథ్, గుజరాతి సురేష్, హరికృష్ణ, వడ్డే రాము, యశ్వంత్, తిమ్మారెడ్డి, ధరణి, శేఖర్, అభి పాల్గొన్నారు.

## భారత్‌లోనే హామర్ స్మార్ట్ బాంబుల
# తయారీకి మార్గం సుగం




**బీఈఎల్-ఫ్రాన్స్ సఫ్రాన్ మధ్య కీలక ఒప్పందం**
**70 కిలోమీటర్ల దూరంలో లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం**
**60 శాతం దేశీయ విడిభాగాలతో స్వదేశీ ఉత్పత్తికి శ్రీకారం**

మన గళం, న్యూఢిల్లీ : భారత రక్షణ రంగం ఆత్మనిర్భర దిశగా మరొక కీలక ముందడుగు వేసింది. దేశంలోనే హామర్ స్మార్ట్ బాంబులను తయారు చేసేందుకు భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ మరియు ఫ్రాన్స్‌కు చెందిన సఫ్రాన్ ఎలక్ట్రానిక్స్ అండ్ డిఫెన్స్ సంస్థల మధ్య ముఖ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై బీఈఎల్ సీఎండీ మనోజ్ జైన్, సఫ్రాన్ ప్రతినిధి అలెగ్జాండర్ జీగ్లర్ సంతకాలు చేశారు. ఈ ఒప్పందం మేరకు రెండు సంస్థలు 50:50 వాటాలతో సంయుక్త సంస్థను ఏర్పాటు చేయనున్నాయి. గతంలో ఏరో ఇండియా ప్రదర్శన సందర్భంగా కుదిరిన అవగాహన ఒప్పందం ఇప్పుడు పూర్తి స్థాయి ఉత్పత్తి ఒప్పందంగా మారింది. హామర్ 2 లో..

## కొత్త తుపాను హెచ్చరిక

**రైతులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అచ్చెన్నాయుడు పిలుపు**



మన గళం, అమరావతి : రాష్ట్రంపై మరో తుపాను ముప్పు పొంచి ఉండటంతో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారి, రానున్న 48 గంటల్లో పూర్తి స్థాయి తుపానుగా బలపడే అవకాశం ఉందని మంత్రి హెచ్చరించారు. ఈ నేపథ్యంలో 2 లో..

## ఏపీలో మూడు కొత్త జిల్లాలకు
# సీఎం చంద్రబాబు ఆమోదం

**మార్కాపురం, మదనపల్లె, పోలవరం కొత్త జిల్లాలుగా ప్రకటింపు**



మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో పరిపాలనా సౌలభ్యం, ప్రజా సేవల అందుబాటును మెరుగుపరిచే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో కొత్తగా మూడు జిల్లాలను ఏర్పాటు చేయడానికి ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇందుకోసం మంత్రుల కమిటీ సమర్పించిన నివేదికను రెండు రోజుల పాటు సమీక్షించిన సీఎం, కొన్ని

## ఈ నెల 30న అఖిలపక్ష భేటీ

సాధారణంగా శీతాకాల సమావేశాలు కీలక చర్చలకు వేదికగా నిలుస్తాయి. ఈసారి కూడా భద్రత, ఆర్థిక వ్యవహారాలు, రాష్ట్రాల అభ్యర్థనలు, ప్రభుత్వ ప్రాధాన్య బిల్లులు వంటి అంశాలు సమావేశ కేంద్ర బిందువుగా మారే అవకాశముంది. అధికారపక్ష–ప్రతిపక్షాల మధ్య గత సమావేశాల్లో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ భేటీ ప్రాముఖ్యత పెరిగింది. డిసెంబర్ 1 నుంచి 19 వరకు సమావేశాలు కొనసాగనున్నాయి. మూడు వారాలపాటు మొత్తం 15 సమావేశాలు నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధమైంది. పలు శాఖలకు సంబంధించిన నివేదికలు, చట్టసవరణలు, ముఖ్య విధానాలపై చర్చ జరిగే అవకాశం ఉంది. కీలక అంశాలు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ఈ సెషన్ మరింత ఉత్కంఠతో సాగుతుందని రాజకీయ నిపుణులు భావిస్తున్నారు. ఇదే సమయంలో 12 రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ విషయంలో కేంద్రంపై వారు తీవ్రంగా విమర్శలు గుప్పించడంతో, అఖిలపక్ష సమావేశంలో ఎన్నికల జాబితా సవరణ కీలక చర్చాంశంగా మారే అవకాశం ఉంది. జనాభా ఆధారంగా ఓటర్ల జాబితా మార్పులపై విస్తృత చర్చ అవసరమని ప్రతిపక్ష నేతలు కోరుతున్నారు.

## బుర్హాన్ వనీ హత్యకు ప్రతీకారం

అరెస్టైన ఉగ్ర ముఠా సభ్యుల విచారణలో ఉమర్‌పై కీలక వివరాలు బయటపడ్డాయి. జైషే మహ్మద్ ఉగ్ర సంస్థ తరఫున పనిచేసిన మౌల్వీ ఇర్ఫాన్ అహ్మద్ మార్గం ద్వారా ఈ ముఠాలో చేరిన ముజామిల్ షకీల్ అనే వ్యక్తి ఉమర్ ఎంత ప్రభావశీలి అన్న విషయాన్ని దర్యాప్తు అధికారులకు తెలిపాడు. ఉమర్ తెలివితేటలు, ప్రణాళికల ముందు తాను సాధారణ కూలీ లాంటి వాడినని ముజామిల్ పేర్కొన్నట్టు తెలుస్తోంది. విచారణ ప్రకారం, ఉమర్ ఉన్ నబీకి తొమ్మిది భాషల్లో ప్రావీణ్యం ఉంది. అతడి తెలివి అణు శాస్త్రవేత్త స్థాయిలో ఉందని సహచరులే అంగీకరించారు. 'అమీర్' అనే పేరుతో స్ఫూర్తి కలిగిస్తూ, మతపరమైన విధిగా తాను చేస్తున్న పనిని న్యాయంగా చూపిస్తూ మిగతా సభ్యులపై ప్రభావం చూపేవాడని విచారణా వర్గాలు పేర్కొన్నాయి. ఈ దాడికి ఉగ్ర ముఠా 'ఆపరేషన్ అమీర్' అనే పేరు కూడా పెట్టుకున్నట్టు తెలిసింది. 2016లో భద్రతా దళాల చేతిలో హతమైన బుర్హాన్ వనీ మరణానికి ప్రతీకారం తీర్చుకోవాలనే ఉద్దేశంతోనే ఉమర్ ఈ ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడని విచారణలో తేలింది. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దు, మేవాట్–నూహ్ ప్రాంతంలోని మత ఘర్షణలు, గో రక్షకుల చేతిల్లో ఇద్దరు యువకుల హత్య వంటి ఘటనలు తనను తీవ్రంగా ప్రభావితం చేశాయని సహచరులు చెప్పారు. దాడికి ఉపయోగించిన కారులో ఎసిటోన్, చక్కెర పొడి, యూరియా వంటి పదార్థాలతో బాంబు తయారు చేసినట్లు గుర్తించారు. ఫరీదాబాద్‌లోని అల్–ఫలా విశ్వవిద్యాలయంలో తన గదిలోనే బాంబు తయారీపై ప్రయోగాలు చేసిన ఆధారాలు దొరికాయని అధికారులు తెలిపారు.

## భారత్‌లోనే హామర్ స్మార్ట్ బాంబుల తయారీకి మార్గం సుగం

తయారీ భారత రక్షణ స్వావలంబనకు ప్రధాన మైలురాయిగా పరిగణిస్తున్నారు. హామర్ స్మార్ట్ బాంబు రఫేల్ యుద్ధవిమానాల్లో వాడే అత్యంత ఖచ్చితత్వం గల ఆయుధ వ్యవస్థ. ఇది 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న శత్రు బంకర్లు, కమాండ్ కేంద్రాలు, రాడార్లను లక్ష్యంగా చేసుకుని ధ్వంసం చేయగలదు. గగనతలంలో దిశ మార్చుకోవడం, జామింగ్ నిరోధక సామర్థ్యం వంటి లక్షణాలు దీనిని మరింత శక్తివంతమైన ఆయుధంగా నిలబెడుతున్నాయి. ఈ ఒప్పందం 'మేకిన్ ఇండియా' కార్యక్రమానికి బలమైన ఆత్మవిశ్వాసాన్ని ఇస్తోంది. ప్రారంభ దశలో కొంత భాగాలు విదేశాల నుంచి దిగుమతి చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ, దశలవారీగా 60 శాతం ఎలక్ట్రానిక్ మరియు యాంత్రిక భాగాలను స్వదేశీగా తయారు చేయనున్నారు. తయారీ, పరీక్ష, నాణ్యత నియంత్రణ బాధ్యతలను బీఈఎల్ చేపట్టనుంది. దీతో భారత వాయుసేన, నౌకాదళం అవసరాల్లో విదేశీ ఆధారాన్ని తగ్గించవచ్చని అధికారులు పేర్కొన్నారు. తేజస్ యుద్ధవిమానాల్లో కూడా హామర్ అమర్చే అవకాశం ఉందని సమాచారం.

## చైనా కొత్త రక్షణ అంతరిక్ష నౌక ప్రయోగం



మన గళం, మానవ సహిత అంతరిక్ష ప్రయోగాల సమయంలో ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే రక్షణ చర్యలు చేపట్టేందుకు చైనా ఎప్పుడూ ప్రత్యేక బ్యాకప్ నౌకను సిద్ధం చేస్తుంది. ఈ విధానం వల్ల అంతరిక్షంలో నెలల తరబడి చిక్కుకుపోయే ప్రమాదం యాత్రికులకు ఎదురుకాదు. ఈ నేపథ్యంలో ఇటీవల ఖాళీగా ప్రయోగించిన శెన్జౌ–22 నౌక కూడా ఇదే రక్షణ లక్ష్యంతో పంపించబడింది. ఈ శెన్జౌ–22 నౌక వాస్తవానికి శెన్జౌ–21 మానవ సహిత ప్రయాణానికి రక్షణ నౌకగా సిద్ధం చేయబడింది. అత్యవసర పరిస్థితుల్లో ఈ నౌక వెంటనే అంతరిక్షానికి చేరుకుని యాత్రికులను భూమికి తీసుకురావడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. చైనా అంతరిక్ష పరిశోధన సంస్థ ఈ విధానాన్ని నిరంతరం అమలు చేస్తూ వస్తోంది. ఇంతకుముందు శెన్జౌ–20 నౌకలో ప్రయాణించిన యాత్రికులు అంతరిక్ష వ్యర్థాల ఢీకొనడం కారణంగా తమ తిరుగు ప్రయాణం ఆలస్యమయ్యింది. ఆ సమయంలో రక్షణ నౌక సిద్ధంగా ఉండటంతో వారు శెన్జౌ–21 నౌక ద్వారానే భూమికి తిరిగి చేరుకున్నారు. ఈ అనుభవం తర్వాత రక్షణ నౌక సిద్ధతపై చైనా మరింత జాగ్రత్తలు తీసుకుంది. ప్రస్తుతం శెన్జౌ–21 నౌకలో ప్రయాణిస్తున్న ముగ్గురు యాత్రికులను వారి మిషన్ పూర్తయ్యాక సురక్షితంగా భూమికి రప్పించేందుకు శెన్జౌ–22 నౌకను వినియోగించనున్నట్టు చైనా పేర్కొంది. అంతరిక్ష భద్రత, రక్షణ విధానాల్లో చైనా తీసుకుంటున్న జాగ్రత్తలు ప్రపంచ అంతరిక్ష రంగంలో విశేషంగా గుర్తింపు పొందుతున్నాయి.

# బాధ్యతలు కూడా గుర్తుంచుకోండి





కనకపుట్లమ్మ 'స్టూడెంట్ మాక్ అసెంబ్లీ'కి ఎంపికైన సందర్భం గా ఆమెను తన నివాసంలో అభినందించారు. విద్యార్థులలో బాధ్యతాయుత భావం పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఎనిమిదో తరగతి చదువుతున్న కనకపుట్లమ్మ వ్యాసరచన, చర్చా పోటీలు, ప్రశ్నోత్తరాల్లో చూపిన ప్రతిభ ఆధారంగా మాక్ అసెంబ్లీలో పాల్గొనే అవకాశం దక్కించుకుంది. "నేటి విద్యార్థులే రేపటి భవిష్యత్తు" అని పేర్కొన్న మంత్రి లోకేశ్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యువతపై ఉంచిన ఆశయాలను విద్యార్థులే నెరవేర్చాలని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్యాంగ దినోత్సవం రోజున విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించే ఆలోచన సీఎం తో చర్చించిన తర్వాతే అమలు చేసినట్టు తెలిపారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు పాఠశాల స్థాయిలోనే చర్యలు ప్రారంభించామని లోకేశ్ వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సెంట్రలైజ్డ్ వంటగదులు ఏర్పాటుచేస్తున్నామని చెప్పారు. ప్రతి ఏటా మాక్ అసెంబ్లీ నిర్వహించి, విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య విలువలు నేర్పే దిశగా చర్యలు కొనసాగుతాయని తెలిపారు. విద్యార్థినీ కుటుంబ పరిస్థితుల గురించి తెలుసుకున్న మంత్రి లోకేశ్, పుట్టుకతో దివ్యాంగుడైన ఆమె తండ్రి ట్రై%–%స్కూటర్‌పై కూరగాయలు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని తెలుసుకుని, కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. "మంగళగిరి నా కుటుంబంలా మారిపోయింది. ప్రజలు నాపై ఉంచిన నమ్మకానికి నేను మరింత బాధ్యతగా పని చేస్తాను" అని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థిని కనకపుట్లమ్మ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు.

# కొత్త తుపాను హెచ్చరిక

సంబంధిత శాఖలను అప్రమత్తం చేసినట్టు తెలిపారు. పంటలు నష్టపోకుండా రైతులు ముందుగానే చర్యలు తీసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే వరి కోతలు పూర్తిచేసిన రైతులు తమ ధాన్యాన్ని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిందిగా సూచించారు. ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు ప్రభుత్వం ఉచితంగా టార్పలిన్ పట్టాలు పంపిణీ చేస్తోందని తెలిపారు. జిల్లాల వారీగా వ్యవసాయ అధికారులు రైతులకు సలహాలు, మార్గదర్శకాలు అందించేం దుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. సముద్రం అలజడిగా ఉన్న నేపథ్యంలో మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వేటకు వెళ్లరాదని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే వేటకు వెళ్లిన వారు వెంటనే తీరానికి తిరిగి రావాలని సూచించారు. తుపాను ప్రభావం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సముద్ర తీర ప్రాంతాల్లో అప్రమత్తత చర్యలు చేపట్టాలని మత్స్యశాఖకు ఆదేశాలు జారీ చేశారు. రాబోయే రోజుల్లో వర్షాలు, గాలుల తీవ్రత పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంగా పని చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రైతుల పంటల రక్షణ, ప్రజల భద్రత ప్రభుత్వ బాధ్యత అని, తుపాను నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

## ఏపీలో మూడు కొత్త జిల్లాలకు సీఎం చంద్రబాబు ఆమోదం

మార్పులతో ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. దీంతో మొత్తం జిల్లాల సంఖ్య 26 నుంచి 29కి పెరగనుంది. కొత్త జిల్లాలుగా మార్కాపురం, మదనపల్లె, పోలవరం జిల్లాలను ప్రభుత్వం ప్రకటించింది. పోలవరం జిల్లాకు రంపచోడవరం కేంద్రంగా నిర్ణయించారు. ఈ కొత్త జిల్లాల ఏర్పాటు వల్ల గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతం కావడంతో పాటు, ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ కానున్నాయని అధికారులు భావిస్తున్నారు. తీర ప్రాంతం, రాయలసీమ, కొండ ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం తెలిపింది. జిల్లాలతో పాటు రెవెన్యూ వ్యవస్థలో కూడా ముఖ్యమైన మార్పులు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు ప్రతిపాదనకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. ఈ కొత్త డివిజన్లునక్కపల్లి (అనకాపల్లి జిల్లా), అద్దంకి (ప్రకాశం జిల్లా), పీలేరు (మదనపల్లె జిల్లా), బనగానపల్లె (నంద్యాల జిల్లా), మడకశిర (సత్యసాయి జిల్లా)ఏర్పాటుకానున్నాయి. అదనంగా, కర్నూలు జిల్లాలో ఆదోని మండలాన్ని విభజించి పెద్దహరివనాన్ని కొత్త మండలంగా ఏర్పాటు చేసేందుకు కూడా అనుమతి ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనలు, భౌగోళిక పరిస్థితులు, పరిపాలనా అవసరాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయాలను మంత్రుల కమిటీ సిఫార్సు చేసినట్టు అధికారులు తెలిపారు. త్వరలోనే కొత్త జిల్లాల ఏర్పాటుకు సంబంధించిన అధికారిక ప్రక్రియను ప్రారంభించనున్నట్లు సమాచారం.

# టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డికి సీఐడీ నోటీసులు

- **మంగళవారం సాయంత్రం విచారణకు హాజరు కావాలని ఆదేశం**
- **2023 ఏప్రిల్‌లో వెలుగులోకి వచ్చిన చోరీ కేసు మళ్లీ దర్యాప్తు వేగవంతం**
- **లోక్ అదాలత్ రాజీ నిర్ణయం, ఆస్తుల వివాదంపై కొత్త ఆరోపణలు**



మన గళం, తిరుమల : తిరుమల పరకామణి చోరీ కేసులో రాష్ట్ర సీఐడీ అధికారులు టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డికి నోటీసులు జారీ చేశారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు విచారణకు హాజరు కావాలని పేర్కొన్నారు. తిరుమల శ్రీవారి పరకామణిలో 920 అమెరికన్ డాలర్ల చోరీ కేసు మళ్లీ కొత్త మలుపు తిరగడంతో ఈ నోటీసులు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పరాకమణి విభాగంలో 2023 ఏప్రిల్ 7న సీనియర్ అసిస్టెంట్ రవికుమార్ విదేశీ కరెన్సీ చోరీ చేస్తూ విజిలెన్స్ అధికారుల చేత పట్టుబడ్డాడు. ఈ ఘటనపై అప్పటి టీటీడీ విజిలెన్స్ ఎస్ఐ సతీష్ కుమార్ ఫిర్యాదుతో తిరుమల ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. అదే ఏడాది మే 30న విజిలెన్స్ అధికారులు రవికుమార్‌పై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అనంతరం హైకోర్టు ఆదేశాల మేరకు సీఐడీ కేసును చేపట్టి డిసెంబర్ 2వ తేదీకి నివేదిక సమర్పించాలని సూచన వచ్చింది. ఈ కేసులో రవికుమార్ ఆస్తులపై రాజకీయ ఒత్తిడులు, లాభాల దృష్టితో జోక్యం జరిగిందన్న ఆరోపణలు ముందే వినిపించాయి. కేసు నుండి తనను తప్పిస్తే ఆస్తులను టీటీడీకి విరాళంగా ఇస్తానని రవికుమార్ చెప్పిన తర్వాత, అతని ఆస్తులపై పలువురు వైసీపీ నాయకులు దృష్టి సారించారని ఆరోపణలు వచ్చాయి. 2023 సెప్టెంబర్ 9న లోక్ అదాలత్‌లో కేసును రాజీ చేయించేందుకు ప్రయత్నాలు జరగ్గా, టీటీడీ బోర్డు తీర్మానంతో కొన్ని ఆస్తులను స్వీకరించేందుకు చర్యలు ప్రారంభించడంతో పరాకమణి కేసు పక్కకు వెళ్లిపోయినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత కేసు మళ్లీ వెలుగులోకి వచ్చింది. సీఐడీ విచారణను వేగవంతం చేస్తూ సంబంధిత అధికారులను, మాజీ టీటీడీ సభ్యులను విచారణకు పిలుస్తోంది. ఇదిలా ఉండగా, ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న మాజీ ఏవీఎస్‌వో సతీష్ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన వివాదాన్ని మరింత తీవ్రం చేసింది. విచారణలో కొత్త వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు సూచిస్తున్నారు.

## అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని




మనగళం, కర్నూలు సిటీ : ఆర్టీసీ ఏలూరు డిపో పరిధిలోని రెంటల్ ఆయిల్ ఔట్లెట్ (పెట్రోల్ బంక్) నందు అవినీతి జరిగి సంస్థ నిధులు దారి మళ్లీ సుమారు రూ. 83 లక్షలు దుర్వినియోగమైనట్లు అందుకు ఎలాంటి బాధ్యులు కానీ ఎస్ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ సుందరయ్య తో పాటు మరో ఇద్దరిని అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఈరోజు మంగళవారం ఎస్ డబ్ల్యూ ఎఫ్ ఆధ్వర్యంలో కర్నూలు ఒకటి, రెండవ డిపోల ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేశించి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. అంజిబాబు, ఎస్ డబ్ల్యూ ఎఫ్ మాజీ రాష్ట్ర కోశాధికారి జె .దివాకర్ మాట్లాడుతూ యాజమాన్యము తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి, సంస్థ నిధుల దుర్వినియోగానికి ఎలాంటి సంబంధం లేని ఎస్డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ సుందరయ్యను అక్రమంగా సస్పెండ్ చేయడం సమంజసం కాదన్నారు. కీలకమైన ఆర్థిక అంశాలతో లావాదేవీలుగా ఉన్న చోట ప్రవేట్ వ్యక్తులకు కాంట్రాక్టుకు అప్పగించి యాజమాన్యం అవినీతికి అవకాశం కల్పించిందన్నారు. ముందస్తుగా ఎలాంటి విధివిధానాలను యాజమాన్యం రూపొందించలేదు. సస్పెండ్ చేస్తామని కొంతమంది ఉద్యోగ కార్మికులను బెదిరించి అన్యాయంగా 50 లక్షల రూపాయలను వసూలు చేయడాన్ని ఎస్డబ్ల్యుఎఫ్ తప్పు పడుతున్నది. అవినీతికి బాధ్యులైన వారిపై చర్యలను కేంద్రీకరించకుండా పక్కదారి పట్టి ఇలాంటి కుటిల చర్యలతో సంస్థ ప్రతిష్టను యాజమాన్యం దిగదార్చింది. సమగ్ర విచారణ జరిపి బాధ్యులు అందుకు బాధ్యులైన అయిన అధికారులను వదిలిపెట్టి అమాయకులను బలి పశువులను చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం సమగ్ర విచారణ జరిపించి దోషులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశఆరు. అధికారులు తమ బాధ్యతలను విస్మరించి ఉద్యోగ కార్మికులపై చర్యలు తీసుకోవడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమన్నారు. తక్షణమే అక్రమంగా సస్పెండ్ చేసిన సిహెచ్ సుందరయ్య తో పాటు మరో ఇద్దరిని బేషరతుగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో జిల్లా నాయకులు హనుమంత్ రెడ్డి, ఎన్. సత్యరాజు, ఎస్ ఆర్ కె రెడ్డి, ఎం ఆంజనేయులు, మధుమోహన్, కర్నూలు 1 డిపో కార్యదర్శి బి నాగరాజు, కర్నూలు 2 డిపో కార్యదర్శి, సి బజారి, డిపో నాయకులు జానకి రాముడు, ఎస్ .ఏ. సలాం తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి






మనగళం, కర్నూలు క్రైం : సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. పోలీసలు అప్రమత్తం చేస్తున్నా ప్రజలు మోసపోతూనే ఉన్నారు. సాక్షాత్తూ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పలుమార్లు ప్రతికల ద్వారా సైబర్ నేరాలు జరుగుతున్న తీరును వివరించినా సైబర్ మోసగాళ్ల ఉచ్చులో ప్రజలు చిక్కుకుంటూనే ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన తీరును జిల్లా ఎస్పీ వివరిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కర్నూలు పోలీసులు వినూత్నంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. కర్నూలు నాల్గవ పట్టణ సీఐ విక్రమసింహా వినూత్నంగా ఆటో లో మైకు పెట్టించి సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ఆటో కు ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించి సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. సైబర్ నేరాల వల్ల మోసపోయిన వారిలో ఎక్కువగా యువత ఉంటున్నారని, ఖచ్చితంగా యువత సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు తెలియజేస్తున్నారు. బ్యాంకు ఖాతా, ఏటీఎం పిన్ నెంబర్లు, ఓటిపి వివరాలు తెలియని వ్యక్తులకు చెప్పకూడదన్నారు. వాట్సప్, ఫేస్బుక్, టెలిగ్రామ్, ఇన్స్టాగ్రామ్, వంటి సోషల్ మీడియా లలో ఆన్లైన్ పార్ట్ టైం ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఓటిపి ఫ్రాడ్స్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, ఫేక్ లోన్ యాప్స్ , డిజిటల్ అరెస్ట్ పలు రకాలుగా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసాలు చేస్తున్నారన్నారు. ఈ విధంగా ఎవరైనా సైబర్ నేరానికి పాల్పడుతున్నట్లు తెలిసినా, సైబర్ నేరం జరిగినా వెంటనే సైబర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే సైబర్ క్రైమ్ 1930 హెల్ప్ లైన్ నంబర్కు ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరాల బారిన పడకుండా ఉండాలని కర్నూలు పోలీసులు తెలియజేస్తున్నారు.

# దాడులకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలి





మనగళం, కర్నూలు సిటీ : హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య భవన్ లో సెమినార్ నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు శ్యామల అధ్యక్షతన జరిగిన సెమినార్ ను ఉద్దేశించి ఐద్వా సీనియర్ నాయకురాలు నిర్మల,జిల్లా కార్యదర్శి అరుణ మాట్లాడుతూ దేశంలో రోజురోజుకీ మహిళలపై వయసుతో సంబంధం లేకుండా దాడులు,అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.చీకటి పడితే చాలు చిన్నపిల్లల నుంచి ముసలి వారి దాకా మహిళలు బయట స్వతంత్రంగా తిరగలేని పరిస్థితి ఉందని,మహిళలు అణచివేతకు వ్యతిరేకంగా సమాన హక్కుల కోసం మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం తీసుకువచ్చిన చట్టాలను కఠినంగా అమలు చేయకపోవడం వలన దాడులు, దౌర్జన్యాలు పెరిగి పోతున్నాయని విమర్శించారు. అర్ధరాత్రి మహిళలు స్వతంత్రంగా బయట తిరిగినప్పుడు, ఆ విధమైన రక్షణ కల్పించినప్పుడే మహిళల అభివృద్ధి జరుగుతుందన్నారు. మహిళా అభివృద్ధి సమాజాభివృద్ధి అని వారు తెలిపారు. భవిష్యత్తులో మహిళల రక్షణ కోసం, మహిళలపై జరుగుతున్న దాడులు,దౌర్జన్యాలు అత్యాచారాలు, హింసకు వ్యతిరేకంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం చేపట్టే కార్యక్రమాలలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అలాగే నవంబర్ 25 హింస వ్యతిరేక దినోత్సవం నుండి డిసెంబర్ 10వ తేదీ మానవ హక్కుల దినోత్సవం వరకు ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించే సెమినార్స్ ను జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సుజాత, న్యూ సిటీ కార్యదర్శి కుమారి, ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు సావిత్రి, వేణి, రాధమ్మ, ఉమా, పర్వీన్ పలు ఏరియాల నుంచి మహిళలు పాల్గొన్నారు.

## విద్యా రంగం బలోపేతానికి పోరాడుతాం







మనగళం, కర్నూలు సిటీ : ప్రభుత్వ విద్యా రంగం బలోపేతానికి పోరాడుతామని ఎస్ఎఫ్ఐ పూర్వ రాష్ట్ర నాయకులు ఆనంద్ బాబు, ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సాయి, రంగప్ప పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ కర్నూల్ నగర మహాసభ మంగళవారం స్థానిక కే.కే భవన్లో నిర్వహించడం జరిగింది. మహాసభ సూచికగా స్వాతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం లక్ష్యాలతో కూడిన జెండా నగర అధ్యక్షులు అబుబక్కర్ ఎగరవేశారు . అనంతరం మహాసభను ఉద్దేశించి వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యను సామాజిక హక్కుగా కాకుండా మార్కెట్ ఉత్పత్తిగా మారుస్తుందన్నారు. ప్రస్తుత విద్యారంగం అత్యంత సంక్షోభంలో ఉందన్నారు. ప్రభుత్వం ప్రజా విద్యను బలోపేతం చేయాల్సిన సమయంలో కేవలం వ్యాపారంగా మార్చే ప్రైవేటీకరణ విధానాలు వేగంగా విస్తరిస్తున్నాయి. దీని ఫలితంగా పేద మధ్యతరగతి విద్యార్థులు నాణ్యమైన విద్యకు చేరుకోలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు మూసివేతకు గురవుతుండగా, పట్టణ లో ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వస్తువులు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థులపై ఆర్థిక భారాలు వేస్తూ అనేకమంది విద్యార్థులను చదువుకు దూరం చేస్తుందన్నారు. ప్రభుత్వ విద్యా రంగం బలహీనపడడంతో సమాజంలో అసమానతలు మరింత పెరుగుతాయన్నారు. విద్య అనేది సామాజిక అభివృద్ధి మూల స్తంభం అని, ప్రస్తుత విధానాలు దాన్ని లాభార్జన సాధనంగా మారుస్తున్నాయని విమర్శించారు. ఉన్నత విద్య ధనవంతులకు మాత్రమే పరిమితం అవుతుందని, పేద మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ఇలాంటి పరిస్థితులను ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తూ మరిన్ని పోరాటాలు భవిష్యత్తుల్లో నిర్వహిస్తుందని తెలియజేశారు. అనంతరం నూతన ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా ఆర్యన్, కార్యదర్శిగా అంజి , ఉపాధ్యక్షులుగా అబ్బు, పృధ్వి, భాస్కర్, శ్రీలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా యోగి, ఉదయ్, రమేష్, సాయి, దీపికను ఎన్నుకున్నారు. అదేవిధంగా సమితి, కమిటీ సభ్యులను ఎంపిక చేశారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించాలి




మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కర్నూలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం మండల నాయకుడు రాఘవేంద్ర అధ్యక్షతన ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీ.రామకృష్ణ, మండల కార్యదర్శి హుస్సేనయ్య మాట్లాడారు. కర్నూలు మండల అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని, రైల్వే వ్యాగిన్ వర్క్ షాప్ పూర్తి చేసి యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివిధ గ్రామాలలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం చేయాలని, రోడ్లు వేయాలని, డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలన్నారు. ఇప్పటికీ స్మశానానికి స్థలం లేక ఇబ్బంది పడుతున్న గ్రామాలు ఉండడం బాధాకరమన్నారు. ఇల్లు లేని పేదలకు ప్రభుత్వం ఇస్తామన్న మూడు సెంట్లు స్థలాన్ని వెంటనే ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు సహాయం చేయాలన్నారు. జాతీయ రహదారులు రాష్ట్ర రహదారుల కోసం రైతుల నుండి తీసుకున్న భూములకు వెంటనే పరిహారం ఇవ్వాలని, రైతుల పొలాలకు సర్వీస్ రోడ్లు వేయాలని, కల్వర్టు లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నీ ప్రభుత్వం పరిష్కారం చేయకపోతే ఆర్డీవో కార్యాలయాన్ని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ రమేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు బాలపీరా, శ్రీరాములు, నరసింహులు, ఆంజనేయులు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, నాయకులు హరికిషన్ రెడ్డి, ప్రకాష్, రాము, విశ్వనాథ్, మస్తాన్, శంకర్, చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

## పీఎం శ్రీ ప్రోగ్రాం కింద స్కూలు పిల్లలకు భూసార పరీక్షల ఆవశ్యకత పైన శిక్షణ కార్యక్రమము




మన గళం కోడుమూరు: కోడుమూరు మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ మరియు జూనియర్ కాలేజ్ నందు పీఎం శ్రీ ప్రోగ్రాం కింద స్కూలు పిల్లలకు భూ ఆరోగ్యం మరియు భూసార పరీక్షల ఆవశ్యకత పైన శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు ఈ సందర్భంగా స్కూలు మరియు కాలేజీ పిల్లలకు మట్టి ఆవశ్యకతను తెలుపుతూ మట్టి నమూనాలను సేకరించి విధానం తెలియజేశారు అలాగే రసాయని ఎరువుల వాడకాన్ని తగ్గించి భూ ఆరోగ్యాన్ని కాపాడుట గురించి విద్యార్థులకు నేర్పించారు. ఈ కార్యక్రమంలో కర్నూల్ సబ్ డివిజన్ ఏడిఏ ఏ ఎం సాలు రెడ్డి మరియు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఆశాజ్యోతి మరియు మట్టి పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారిని హరిప్రియ మరియు ఆత్మ బీటీఎం చక్రవర్తి నాయక్ మరియు ఆసిఫ్ భాష మరియు మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్ పాల్గొనడం జరిగినది.

## కర్నూలు ప్రెస్ క్లబ్ కు బీరువా విరాళం




మనగళం, కర్నూలు సిటీ : ప్రెస్ క్లబ్ కర్నూల్ కార్యాలయానికి ప్రెస్ క్లబ్ సభ్యురాలు, సీనియర్ డెస్క్ ఇన్చార్జి సుజాత బీరువాను విరాళంగా అందజేశారు. ఈ మేరకు మంగళవారం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొత్తూరు సత్యనారాయణ గుప్తకు బీరువాతోపాటు తాళాలు అందజేశారు. ఈ సందర్భంగా కొత్తూరు సత్యనారాయణ గుప్తా మాట్లాడుతూ సాయం అడిగినా స్పందించని ఈ రోజుల్లో అడగకుండానే ప్రెస్ క్లబ్ కార్యాలయానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు వస్తు రూపేనా ఇవ్వడం ఆనందాన్ని కలిగిస్తున్నదన్నారు. అతి తక్కువ సమయంలో దాతలు సోషల్ మీడియా ద్వారా కర్నూల్ లో ప్రెస్ క్లబ్ ఏర్పాటు కావడం పట్ల అభినందనలు తెలుపుతూ వస్తున్నారని, తమ వంతు సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెబుతున్న వారు ఎందరో అని ఆయన తెలిపారు. త్వరలో ప్రెస్ క్లబ్ కార్యాలయ ప్రారంభం అవుతుందని, ఇంకా కొన్ని వసతులు కల్పించుకున్నాక పూర్తిస్థాయిలో కార్యాలయం పనితీరు జరుగుతుందని తెలిపారు. ప్రెస్ క్లబ్ సభ్యురాలు, సీనియర్ డెస్క్ ఇన్చార్జి సుజాత మాట్లాడుతూ కొత్తూరు సత్యనారాయణ పట్టుదలతో కర్నూల్ లో ప్రెస్ క్లబ్ ఏర్పాటు కావడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నదని తెలిపారు. తనవంతుగా చిన్న విరాళం ఇవ్వాలని చాలా రోజులుగా అనుకుంటూ వస్తున్నానని, ఆ కోరిక ఈరోజు నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు. పాత్రికేయులు ఐకమత్యంతో ఉండాలని ఆమె కోరారు.

# మహిళా మార్ట్ డబ్బులకు పీడీ బాధ్యత వహించాలి

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ఏపీ మెప్మా ఆర్పి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరవధిక నిరసన దీక్ష మంగళవారం కలెక్టరేట్ ఎదుట కొనసాగింది. ఈ సందర్భంగా శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల మాట్లాడుతూ ఆర్పీలకు పొదుపు గ్రూపులు సభ్యులు బ్యాంకు లింకేజీ లోన్ రికవరీ ఆన్లైన్ మీటింగ్ వాటితోనే ఆర్పీల పని ఉంటుందని, కానీ మంత్రులు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర ప్రభుత్వం పొదుపు గ్రూపులకు సంబంధం లేని కార్యక్రమాలలో సమీకరణ పేరుతో ఇతర పనులు చెబుతూ ఆర్పీలను ఒత్తిడి చేయటం సమంజసం కాదన్నారు. ఆర్ పి లకు కనీస వేతనం 26,000 ఇవ్వడంలో విఫలమైన ప్రభుత్వాలు ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ వారు ఆర్పిలుగా నియమించుకోవాలని వత్తిడి చేయడం సమంజసం కాదన్నారు. రాజకీయ నాయకులకు అనుకూలంగా మెప్మా అధికారులు సైతం ఆర్పీలను వేధించడం, అనవసరంగా నోటీసులు ఇవ్వడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. మహిళా మార్ట్ మూతకు కారణమైన ఆనాటి పిడి, మెప్మా అధికారులపై చర్యలు తీసుకోవాలని, మహిళలకు తిరిగి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యామల కే అరుణమ్మ మాట్లాడుతూ పొదుపు మహిళల సొమ్మును కాజేయడం మహిళామార్ట్ మూసేయడానికి కారణమైన నిర్వహణలో బాధ్యత రహితంగా వ్యవహరించిన మెప్మా అధికారులపై చర్యలు తీసు కోవాలన్నారు. పొదుపు గ్రూప్ సభ్యులకు వస్తువుల తయారీపై అవగాహన కల్పించి మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమములు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.రుద్రమ్మ, ఉమాదేవి కోశాధికారి సుజాత, ప్రసాద్, కన్యక, నగర అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీబాయి, షబానా, ఆర్పీలు ధరణి, కైరున్ శకున్ సరోజ, సురేఖ, ఇమాంబి, పాపమ్మ, ఐక్య సంఘం ఓబీలు ఎం ఉమా లక్ష్మీదేవి, పొదుపు మహిళలు పాల్గొన్నారు.




# మహిళలకు అండగా లీగల్ సర్వీసెస్ అథారిటీ






మనగళం, కర్నూలు సిటీ : సమాజంలో స్త్రీలు అనేక సామాజిక, ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారికి అండగా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎల్లప్పుడు ఉంటుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి బి. లీలా వెంకట శేషాద్రి హామీ ఇచ్చారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కర్నూలు కేవీఆర్ డిగ్రీ కాలేజీ ఆఫ్ క్లస్టర్ యూనివర్సిటీ లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ మెంబెర్ రూఖయ్యా బేగం హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ నేటి సమాజంలో స్త్రీలు అనేక సామాజిక, ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని గృహహింసలు, స్త్రీలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు ఎక్కువ అవుతున్నాయని, వీటని అరికట్టే ప్రయత్నంలో ఐక్యరాజ్య సమితి ప్రతి సంవత్సరం నవంబర్ 25న స్త్రీల హక్కుల పరిరక్షణ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవం జరపాలని తీర్మానించిందని గుర్తు చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులు హింసపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించడంతోపాటు ఎలా ఎదుర్కోవాలో తెలియజేయడమే ఈ సదస్సు యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. మహిళలకు న్యాయపరమైన సమస్యలు వస్తే లీగల్ సర్వీసెస్ అథారిటీని సంప్రదించాలని సూచించారు. బాధితరాళ్లు 15100 టోల్ ఫ్రీ నెంబర్ కాల్ చేసినా ఉచిత న్యాయ సహాయాన్ని అందించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ మెంబెర్ రూఖయ్యా బేగం మాట్లడుతూ జాతీయ మహిళా కమిషన్ మహిళల రక్షణ కోరకు ఏర్పాటు చేసిన ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్ 14490 కాల్ చేస్తే సంబంధిత డిపార్ట్మెంట్ వారు వారికి తగిన సహాయాన్ని అందిస్తారని తెలిపారు. సీఐ విజయలక్ష్మి సైబర్, క్రిమినల్ చట్టాల గురించి వివరించారు. అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది సులోచన ఉచిత న్యాయ సేవలు, న్యాయ సేవ అధికార సంస్థ నుంచి ఎలా పొందాలో వివరించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వి. వెంకట రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రంగారెడ్డి,మహిళా సాధికారకత సెల్ అధ్యాపకులు డాక్టర్ పద్మావతి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గుండ్రేవుల ప్రాజెక్టు సాధించేంత వరకు పోరాడుతాం

మనగళం, కర్నూలు సిటీ : జిల్లా ప్రగతికి గుండ్రేవుల ప్రాజెక్టు ద్వారానే బలమైన పునాది పడుతుందని, గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మించేంత వరకు పోరాడుతామని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష అన్నారు. నగరంలోని ధర్నా చౌక్ వద్ద జల సమర దీక్ష చేపట్టిన ఆయనకు రెండో రోజు రైతు సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి, పులకుర్తి భాస్కర్ రెడ్డి, సుంకన్న, సిపిఎం పార్టీ నాయకులు రామకృష్ణ, ఏపీ సర్పంచ్ సంఘం ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్ రెడ్డి, కర్నూలు మేధావుల ఫోరం కన్వీనర్ మన్సూర్ రహేమాన్, డిప్యూటీ మేఊ సిద్ధారెడ్డి రేణుక, కార్పొరేటర్ విక్రమసింహ రెడ్డి, టీచర్స్ యూనియన్ నాయకులు రత్నం, భజరంగదళ్ ప్రతాపరెడ్డి, సిపిఎం, జర్నలిస్టు సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీహర్ష మాట్లాడుతూ.. కర్నూలు నగరంతో పాటు పరిసర గ్రామాల్లో 10 లక్షల మంది ప్రజలకు, 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మించడం ద్వారా జిల్లా అన్ని రంగాల్లో వృద్ధి సాధించేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం పార్టీలకతీతంగా నాయకులు, ప్రజాసంఘాలు, రైతులు, యువత విద్యార్థులందరూ కలిసి వస్తేనే ప్రభుత్వాలు దిగి వస్తాయన్నారు. కార్యక్రమంలో కేపియస్ నాయకులు హరినాథ్, శ్రీనివాసులు, నౌషధ్, రామాంజనేయులు, ప్రేమ్, భార్గవ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రైవేటు సంస్థలతో రుణాల మంజూరుకు కృషి

**– టిడ్కో గృహాలను త్వరితగతిన కేటాయించేందుకు చర్యలు – లబ్ధిదారులతో మెప్మా పీడీ శ్రీనివాసులు**

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : టిడ్కో గృహాల లబ్ధిదారులకు ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలతో రుణాలు మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నామని మెప్మా పీడి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో మెప్మా సీఓలు ,ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. మెప్మా పీడి మాట్లాడుతూ.. టిడ్కో ఇళ్ళుల పనులు త్వరితగతిన పూర్తి అవుతున్నాయని, లబ్ధిదారులకు గృహాల అప్పగింత వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు. టిడ్కో నుండి రుణాలు మంజూరు కానీ లబ్ధిదారులకు ఈజీ ఫైనాన్స్, ఐఎఫ్ఎఫ్ఎల్ ద్వారా రుణాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగానే లబ్ధిదారులు, ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వడ్డీ ఇన్స్యూరెన్స్ తదితర అంశాలను వెల్లడించారు. యస్హెచ్జి సభ్యులు టిడ్కో గృహాల కోసం బుధవారం నుంచి సమావేశం జరుగుతుందని, లబ్ధిదారులు హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో టిడ్కో అధికారి డాక్టర్ పెంచలయ్య, సిఎంఎం భాస్కర్ రెడ్డి, డిసిఓ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ కే నా సేవలు

**– తప్పుడు ప్రచారాలను నమ్మకండి**
**– ఏఐసీసీ సభ్యుడు జే.లక్ష్మి నరసింహ యాదవ్**

మనగళం, కర్నూలు సిటీ : రాష్ట్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీనీ బలోపేతం చేయడం కోసం నా సేవలు కొనసాగుతాయని ఏఐసీసీ సభ్యులు, కర్నూలు జిల్లా ఇంచార్జ్ జే లక్ష్మీ నరసింహ యాదవ్ తెలిపారు. మంగళవారం కర్నూల్ నగరంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్నూలు, నంద్యాల జిల్లాలకు సంబంధించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, (డీసీసీ) అధ్యక్షుల ఎంపిక కసరత్తు ప్రక్రియ జిల్లాలో జరుగుతున్న సమయాన కొందరు తప్పుడు ప్రచారాలకు పాల్పడం సరైన పద్ధతి కాదని.. పార్టీ బలోపేతనే లక్ష్యంగా ప్రతి ఒక్కరు సమన్వయంతో పని చేయాలని కోరారు. కేంద్ర పరిశీలకుల బృందం ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటిస్తున్న క్రమంలో పదవులు ఆశించే నాయకులు, కార్యకర్తలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నీతి, నిజాయితీ నిబద్ధతతో పనిచేసే ప్రతి నాయకుడికి నా సహకారం ఉంటుందని తెలిపారు. పార్టీ అధిష్టానం జిల్లా అధ్యక్షులుగా నియమించిన వారికి నా సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు. కేంద్ర పరిశీలకు బృందం ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, న్యాయవాదులు, మీడియా, ప్రముఖుల అభిప్రాయాలను సేకరించి అర్హులైన వారి జాబితాను అధిష్టానానికి అందజేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో పైరవీలకు ఎప్పుడు స్థానం ఉండదన్నారు. ఏడేళ్లు నంద్యాల డీసీసీగా, రెండుసార్లు ఎంపీగా, ఒకసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి కాంగ్రెస్ పార్టీకి విస్తృత సేవలు అందించానని, ఆ సేవలు గుర్తింపుగా అధిష్టానం ఏఐసీసీ స్థానం లభించడం నా ఎదుగుదలకు ఆకాశమన్నారు. అదే బాటలో ప్రస్తుత యువతరానికి రాజకీయ భవిష్యత్తు ను నిర్దేశించుకునేందుకు కొత్త నాయకత్వం ఆవిర్భవించేందుకు.. నా వంతు బాధ్యతగా కొత్త నాయకత్వాన్ని, యువతకు అవకాశం ఇవ్వాలని నంద్యాల డీసీసీ పదవికి రాజీనామా చేశానని తెలిపారు. ప్రస్తుతం పాణ్యం నియోజకవర్గ సమన్వయకర్తగా, కర్నూలు జిల్లా ఇన్చార్జిగా, ఏఐ సి సి సభ్యుడిగా రాష్ట్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా రాష్ట్రస్థాయి నాయకత్వానికి సేవలు అందించేందుకు సమయాన్ని కేటాయించేందుకు ఓ ప్రణాళిక రూపొందించుకున్నానని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఆశావహులు డీసీసీ, నగర అధ్యక్షుల స్థానాలకు దరఖాస్తులు చేసుకుని కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

# రూ.14.6 కోట్లతో విశ్రాంతి సదన్

**– ఆసుపత్రి సూపరింటెండెంట్, డా.కె.వెంకటేశ్వర్లు**





మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రూ.14.6 కోట్లతో విశ్రామ్ సదన్ నిర్మించనున్నట్లు ఆసుపత్రి అడిషనల్ డీ ఎం ఈ అండ్ సూపరింటెండెంట్, డా.కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం 'విశ్రాంతి సదన్' నిర్మాణంపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మాస్టర్ ప్లాన్ నమూనా, డిజైన్‌లను పవర్ గ్రిడ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డా.కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సీఎస్ఆర్ నిధుల సహకారంతో స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ సమీపంలో ఎన్ బీసీసీ (నేషనల్ బిల్డింగ్స్ కన్ స్ట్రక్షన్ కార్పొరేషన్ ) ఆధ్వర్యంలో 'విశ్రాంతి సదన్'ను నిర్మిస్తున్నామన్నారు. జీ+3 అంతస్తుల ఆధునిక వసతి భవనం, ఆర్కిటెక్ట్స్ రూపకల్పన మొత్తం 150 పడకల సామర్థ్యం, సింగిల్ రూములు, ట్విన్ రూములు, డార్మిటరీలు, మహిళా వసతి గదులు ఉంటాయన్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చే రోగుల బంధువులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వసతి, ప్రతి అంతస్తులో సౌకర్యవంతమైన గదుల విభజన, సదుపాయాలు ఉంటాయన్నారు. ఈ ప్రాజెక్టు 18 నెలలలో పూర్తవుతుందన్నారు. జీజీహెచ్ పరిసరాల్లో వసతి సమస్యను పరిష్కరించే ప్రధాన ప్రాజెక్టుగా ఈ విశ్రాంతి సదన్ నిలుస్తుందని, పవర్ గ్రిడ్ సీఎస్ఆర్ చొరవతో కర్నూలుకు మరో ప్రాధాన్యత గల వసతి సేవ అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ మూర్తి, డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఇంజినీరింగ్) అబ్దుల్ రహీమ్, నేషనల్ బిల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్ బీసీసీ), బిల్డింగ్ ఆర్కిటెక్ట్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ సమన్వయకర్త ఎస్వీ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు కర్నూలు నగరం, 47 వార్డు పరిధిలోని ధర్మపేటలో నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ లో మన విద్యార్థులకంటే తక్కువ ర్యాంక్ వచ్చిన వాళ్ళకి డాక్టర్ సీట్లు వస్తున్నాయి, వాళ్ళ కంటే మంచి ర్యాంక్ మన రాష్ట్ర విద్యార్థులకి వచ్చిన డాక్టర్ సీటు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం కాలేజీలని 2 సంవత్సరాల నుండి పూర్తి చేయకుండా కాలక్షేపం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో కర్నూలు నియోజకవర్గం నాయకులు, 47వ వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## రాజ్యాంగ దినోత్సవం: స్వతంత్ర భారత ఆత్మకు అద్దం పడే అమూల్య పత్రం

1949 నవంబర్ 26భారత చరిత్రలో అక్షరాలా అపూర్వమైన రోజు. శతాబ్దాల బానిసత్వం నుండి బయటపడి, దేశం ఒక కొత్త యుగానికి అడుగుపెట్టిన సందర్భంలో రాజ్యాంగ సభ దేశ భవిష్యత్తును మార్గనిర్దేశం చేసే అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. అదే భారత రాజ్యాంగాన్ని స్వీకరించడం. ఇది కేవలం ఒక చట్టపత్రం కాదుబీ ఇది ఒక జాతి ఆత్మను, ఆశయాలను, విలువలను ప్రతిబింబించే జీవంతమైన హృదయం. అప్పటి రాజ్యాంగ సభ సభ్యులు దాదాపు మూడు సంవత్సరాల కఠిన శ్రమ, వాదోపవాదాల తరువాత భారత ప్రజల అవసరాలకు సరిపోయే దృఢమైన ప్రజాస్వామ్య ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడం చరిత్రలో మహత్తర ఘట్టం.

రాజ్యాంగం దేశానికి చట్టబద్ధమైన దిశానిర్దేశమే కాదుబీ సామాజిక విప్లవానికి నాంది. కులం, మతం, వర్ణం, లింగం అనే భిన్నతల మధ్య సమానత్వం అనే విలువను నిలబెట్టడంలో ఇది కీలక పాత్ర పోషించింది. ప్రతి పౌరుడికి గౌరవం, సమాన హక్కులు, వ్యక్తిగత స్వేచ్ఛ, చట్టపరమైన రక్షణ వంటి అంశాలను నిర్ధారించడం ద్వారా దేశ వ్యవస్థను బలపరిచింది. స్వతంత్ర భారత నిర్మాణంలో రాజ్యాంగం చూపించిన మార్గమే తర్వాతి దశాబ్దాల్లో అభివృద్ధికి దారితీసింది.

అయితే, ప్రజాస్వామ్యం కేవలం పుస్తకాలలో ఉండే పదం కాదు. దాని ప్రాణం ప్రజల చైతన్యంలో, వ్యవస్థల పారదర్శకతలో, పాలనపై పౌరుల నమ్మకంలో ఉంటుంది. ఈ దిశగా పౌరులు తమ హక్కులను తెలుసుకోవడం ఎంత ముఖ్యమో, దేశ అభివృద్ధికి తమ బాధ్యతలను నిర్వర్తించడం కూడా అంతే అవసరం. దురదృష్టవశాత్తు, ఆధునిక కాలంలో హక్కుల మీద చైతన్యం పెరుగుతున్నా, బాధ్యతలపైనా అదే ఉత్సాహం కనిపించడం లేదు. అందుకే రాజ్యాంగ దినోత్సవం వంటి రోజులు మనందరికీ మళ్ళీ స్ఫూర్తి నింపే సందర్భాలు.

ఇప్పటి కాలంలో ప్రజాస్వామ్యం భారీ సవాళ్లను ఎదుర్కొంటోంది. సమాచార యుద్ధాలు, తప్పుడు ప్రచారాలు, రాజకీయ విభజనలు, సామాజిక భిన్నతలను రెచ్చగొట్టే కుట్రలుఇవి అన్నీ రాజ్యాంగం చూపించిన విలువలను పరీక్షిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రాలను కేవలం చదవడం కాదుబీ వాటిని జీవన విధానంగా మార్చుకోవడం అవసరం. మీడియా, విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు రాజ్యాంగ విలువల ప్రచారంలో ముందుండాలి.

భారత భవిష్యత్తును తీర్చిదిద్దేది మన కొత్త తరం. పాఠశాలల్లో రాజ్యాంగ పఠనం, హక్కుల%–%బాధ్యతల అవగాహన, ప్రజాస్వామ్య విలువల బోధన మరింత బలోపేతం కావాలి. యువతకు సాంఘిక బాధ్యత, నైతికత, సమానత్వం, న్యాయం వంటి విలువలను అందించడం మూల ధ్యేయంగా మారాలి. రాజ్యాంగం జీవించే పత్రంబీ దాని బలం ప్రజలు దానిని ఎంతగా ఆచరిస్తారనేదానిపైనే ఆధారపడి ఉంటుంది.

ఈ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మనం అందరం ఒక వాగ్దానం చేసుకోవాలిమన హక్కులకు కాపలా కావడమే కాదు, మన బాధ్యతలకు కూడా న్యాయం చేయాలి. సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం, స్వేచ్ఛ అనే విలువలను కేవలం నినాదాలుగా కాకుండా, ప్రతిరోజూ జీవితంలో ఆచరణలో పెట్టాలి. ఎందుకంటే ఒక దేశం బలపడేది రాజ్యాంగం వల్ల కాదుబీ రాజ్యాంగాన్ని గౌరవించే ప్రజల వల్ల.

# ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

మనగళం, ఎమ్మిగనూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధాలపై ప్రతిఒక్కరూ ఉద్యమించాలని సీపీఐ (ఎంఎల్ )న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు యు.గనిరాజు పిలుపునిచ్చారు. భూమి, భుక్తి ,విముక్తి పోరులో ప్రాణాలర్పించిన అమరవీరుల వర్ధంతి సభను పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో గ్రామ చావిడి వద్ద జరిగింది. ఈ సభకు సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎం.సత్యన్న అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా హాజరైన గనిరాజు సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.నాగరాజు , పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎండీ రఫీ మాట్లాడుతూ తెలంగాణ, నక్సల్ బరి, శ్రీకాకుళ, గోదావరిలోయ ప్రతిఘటనా పోరాటాలలో వేలమంది తమ జీవితాలను తృణప్రాయంగా అర్పించారన్నారు. భారత విప్లవోద్యమంలో కామ్రేడ్స్ నీలం రామచంద్రయ్య,చంద్ర పుల్లారెడ్డి, చారు మజుందార్, దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి, అలాగే కర్నూలు జిల్లా పార్టీ నాయకులు కామ్రేడ్ తిక్కన్న,గోకారి, ఉరుకుందప్ప,రామన్నగౌడ్ వంటి మహనీయులు అమరులయ్యారని, వారి ఆశయాల సాధనకై మనమంతా సమసమాజ స్థాపనకై ఉద్యమించాలన్నారు. మోదీ ప్రభుత్వం సామ్రాజ్యవాద బడా కార్పొరేట్ కంపెనీలకు అనుకూలమైన విధానాలను అమలు చేస్తుందని విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి,నాలుగు లేబర్ కోడులుగా తీసుకువచ్చి కట్టు బానిసలుగా కార్మికులను మారుస్తుందని దుయ్యబట్టారు. భారతీయ జిడిపిలో 70 లక్షల కోట్లు విలువ చేసే వ్యవసాయరంగాన్ని ఆధాని,అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికే బూటకపు వ్యవసాయ ప్రణాలికను తీసుకువచ్చిందని, ఇది రైతాంగానికి తీవ్రనష్టకరమని,ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.



ఆదివాసీ ప్రాంతంలో లక్షలకోట్లు విలువచేసే సహజవనరులను ,ఖనిజ సంపదను కొల్లగొట్టడానికే ఆపరేషన్ కగార్ ను తీసుకువచ్చి మావోయిస్టులను,అమాయక ఆదివాసీలను బూటకపు ఎన్కౌంటర్లతో హత్యచేయడాన్ని తీవ్రంగా ఖండించాలని అన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం మోదీ అడుగుజాడల్లోనే నడుస్తూ కార్పొరేట్ కంపెనీల భజన చేస్తుందని విమర్శించారు. అధికారం చేపట్టిన 18నెలల కాలంలో 16లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ,ఈ నెల విశాఖలో జరిగిన పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సులో మరో 13 లక్షలకోట్లు పెట్టుబడులు వచ్చాయని,మరో 16 లక్షల పైగా యువతకు ఉద్యోగాలు రాబోతున్నాయని కూటమి సర్కార్ అరచేతిలో వైకుంఠం చూపిస్తుందని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు ఎకరా 99 పైసలకు లీజుకు ఇచ్చి ,వేల కోట్లు రాయితీలు ఇస్తుందని,ఈజ్ ఆఫ్ డూయింగ్ బిసినెస్ పేరుతో అనుమతులు ఇస్తున్నదని,వ్యవసాయ భూములను నాశనం చేస్తున్నదని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను పూర్తిగా అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఐఎఫ్ టీయూ జిల్లా నాయకులు ఎస్. బాలరాజు ,కే .చెన్నకేశవులు, పీడీఎస్ యూ రాష్ట్ర నాయకులు కే సోమశేఖర్, సీపీయుఎస్ఐ జిల్లా నాయకులు పి.రమేష్, ఐఎఫ్ టీయూ జిల్లా నాయకులు ఎస్ బాబు, బి రామలింగం, వి.నరసింహులు, ఎం మల్లికార్జున్, ఎస్ రాజు



తదితరులు మాట్లాడారు. ఈ సభకు ముందుగా పార్టీ జెండాను కే.నాగరాజు ఎగరవేశారు. అమరవీరులకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

## మంత్రి నారా లోకేష్ తో డోన్ ఎమ్మెల్యే కోట్ల పలు కీలక అంశాలపై భేటీ



మన గళండోన్ మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ని డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి డోన్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్యాపిలి పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు గురించి, ఆ కళాశాల ద్వారా స్థానిక విద్యార్థులకు లభించే ప్రయోజనాలు,విద్యా సౌకర్యాల విస్తరణపై వివరాలు మంత్రి కి తెలియజేశారు. అదే విధంగా డోన్ పట్టణానికి రింగ్ రోడ్డు నిర్మాణం అత్యవసరత,ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, భవిష్యత్ పట్టణాభివృద్ధికి గురించి కూడా ప్రత్యేకంగా చర్చించారు. ఎమ్మెల్యే ప్రస్తావించిన అంశాలన్నింటినీ మంత్రి నారా లోకేష్ శ్రద్ధగా విని, ప్రభుత్వ స్థాయిలో వీటి పై త్వరితగతిన చర్యలు తీసుకునేందుకు పూర్తి సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

## గూడూరు టీడీపీ మండల అధ్యక్షుడికి సన్మానం



మనగళం, గూడూరు : టీడీపీ గూడూరు మండల అధ్యక్షుడిగా ఎన్నికైన సురేష్ కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. గూడూరు మండల పరిధిలోని నాగలాపురం గ్రామానికి చెందిన యువకులు సురేష్ ను ఘనంగా సన్మానించారు. బండారి వెంకటేష్ ఆధ్వర్యంలో యువకులు మల్లేష్, పురుషోత్తం, బీ. సురేష్, టీ. సురేష్, వెంకటరాముడు, మోహన్, లక్ష్మన్న, రాముడు, కుమ్మరి పరుశురామ్, బాషా, నాగేష్, కురవ నాగరాజు తదితరులు సురేష్ ను కలిసి అభినందనలు తెలిపారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని సంబరాలు చేశారు. అనంతరం సురేష్ కు పూలమాలలువేసి శాలువాలతో సత్కరించారు.

## అర్హులందరికీ పీఎం ఉజ్వల యోజన




మనగళం, కర్నూలు కలెక్టరేట్ : జిల్లాలో అర్హత ఉన్న పేదలు ప్రతి ఒక్కరికీ ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద లబ్ధి చేకూర్చాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ప్రధానమంత్రి ఉజ్వల యోజన కమిటీకి సంబంధించి సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి బీపీఎల్ కుటుంబం ఈ పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్ పొందే విధంగా చర్యలు వేగవంతం చేయాలని సివిల్ సప్లైస్ అధికారులను ఆదేశించారు. అర్హులైన వారు రేషన్ కార్డు, ఐడెంటి ప్రూఫ్ తీసుకొని సమీప గ్యాస్ ఏజెన్సీ కి వెళ్ళి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీపం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లు మహిళా శక్తీకరణకు, ఆరోగ్యకర కుటుంబాలకు, ఇంటి వంటల్లో శుభ్రత%–%సురక్షకు ఎంతో ముఖ్యమన్నారు. సిలిండర్ డెలివరీ సమయంలో డెలివరీ బాయ్స్ అదనపు వసూళ్లు చేయకుండా గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు చూసుకోవాలన్నారు. ప్రతి గ్యాస్ ఏజెన్సీ ధర పట్టికను స్పష్టంగా ప్రదర్శించాలని, డెలివరీ బాయ్స్ బిల్లు రసీదు ఇవ్వడం తప్పనిసరి అన్నారు. వినియోగదారులు ఎలాంటి అవకతవకలు గమనించినా వెంటనే డిస్ట్రిక్ట్ హెల్ప్‌లైన్ లేదా సివిల్ సప్లైస్ శాఖకు ఫిర్యాదు చేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. అలాగే దీపం పథకం, గ్యాస్ సిలిండర్ డెలివరీ పై రాష్ట్ర వ్యాప్తంగా ఐ.వి.ఆర్.ఎస్ కాల్స్ వస్తున్నాయని, ఐ.వి.ఆర్.ఎస్ కాల్స్ లో కర్నూలు జిల్లా సంతృప్తి శాతం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇంచార్జి సివిల్ సప్లైస్ అధికారి వెంకట రాముడు, గ్యాస్ ఏజెన్సీ లు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోండి.. సిపిఐ.




మన గళండోన్ నియోజకవర్గం నికి తలమానికం అయిన డోన్ ప్రభుత్వ హాస్పిటల్ కు అధిక సంఖ్యలో పేషెంట్లు వైద్యం కోసం వస్తుంటారు పేషెంట్లను ఆ జబ్బును గుర్తించకుండా వారికి పరీక్షలు చేయకుండానే తుతు మంత్రంగా జ్వరం వచ్చిందంటే జ్వరం రెండు మెడిసిన్ టాబ్లెట్లు ఇచ్చి పంపిస్తారు ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్న వైద్యులు కొత్తకోట వ్యక్తికి యాక్సిడెంట్ అయ్యి కాళ్లకు దెబ్బలతో హాస్పిటల్ పోతే అక్కడ డ్యూటీ డాక్టర్లు లేక ఎవరితో చూపించుకోవాలో తెలియని స్థితిలో ఉన్నారు డాక్టర్ లేక పట్టించుకునే నాథుడే లేడు నిన్న సాయంత్రం కమలాపురం నుండి ఒక మహిళ జ్వరము ఆయాసం దగ్గు తలనొప్పితో బాధపడుతూ హాస్పిటల్ పోతే టాబ్లెట్లు ఇచ్చి పంపించారు హాస్పిటల్ ఆవరణంలో ఆమెకి శృతి తప్పి పడిపోయింది అక్కడ సమాచారం తెలుసుకొని సిపిఐ నాయకులు అక్కడ పోతే డాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు ఆమెను అడ్మిట్ చేసుకొని అప్పుడు ఆమెకి వైద్యం చేస్తున్నారు డ్యూటీ డాక్టర్లు కూడా అలన పాలన లేకుండా డ్యూటీ వస్తున్నారు అని వారన్నారు హాస్పిటల్ సూపర్డెంట్ నిర్లక్ష్యంగా పట్టీ పట్టనట్లుగా డ్యూటీ చేస్తున్నారు ప్రజలు ప్రాణాలు అరచేతులు పెట్టుకొని ఆస్పత్రికి వస్తే సిబ్బందిని సక్రమంగా పని చెయ్యకుండా కాలయాపన చేస్తున్నారు ప్రభుత్వ సూపర్డెంట్ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నాడు లక్ష లక్షలు జీతాలు తీసుకుంటూ ప్రజల ఆరోగ్య కాపాడాల్సిన అధికారులే దుర్మార్గంగా పాల్పడుతున్నారు వచ్చిన పేషెంట్లకు రోగ నిరోధక పరీక్షలు చేయకుండానే కర్నూలుకు సింపుల్ గా రెఫర్ చేస్తున్నారు ఇక్కడ పరిరకాలు లేవు చిన్న దెబ్బ అయినా చిన్న జబ్బు కైనా కర్నూలుకి రిఫర్ చేస్తున్నారు ఇక్కడ ఏం జబ్బులు వర్తిస్తాయో డాక్టర్లు సమాధానం చెప్పాలని కోరుతున్నాం లేదంటే పెద్ద ఎత్తున ఈ పార్టీగా ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోటారాముడు డోన్ మండల కార్యదర్శి నారాయణ సిపిఐ నాయకులు నాగరాజు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

**– జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్**




మనగళం, నంద్యాల: డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జాయింట్ కలెక్టర్ మధ్యాహ్న బడి భోజన పథకంపై సంబంధిత అధికారులతో స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.... వందశాతం పిల్లలు ఇష్టపడి భోజనం చేసేలా డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం అమలు చేయాలన్నారు. జిల్లాలో పోషకాహార లోపాన్ని నివారించడానికి, బడికి వస్తున్న పిల్లల సంఖ్యను పెంచేందుకు, పిల్లల మధ్య సామాజిక బంధాలను మెరుగుపరిచేందుకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం అమలు చేస్తున్నామని, ఈ పథకంలో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు. కొన్నిచోట్ల విద్యార్థులు భోజనం చేయకుండా ఇళ్లకు వెళ్లిపోతున్నారని, అలా కాకుండా ప్రతి విద్యార్థి భోజనం చేసేటట్లుగా చూడాలన్నారు. కోడిగుడ్లు సకాలంలో పాఠశాలలకు సరఫరా చేసేటట్లు చూడాలని, గుడ్లు సరఫరాలో సమస్యలు లేకుండా డ్యామేజ్ ఉన్న, అన్సైజ్ గుడ్లను వెనక్కి పంపించాలన్నారు. విద్యార్థులకు మంచి పోషకాహారాన్ని అందించడమే ప్రభుత్వ ధ్యేయమని, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు ప్రధానోపాధ్యాయులు చర్యలు చేపట్టాలన్నారు. సోమవారం నుండి శనివారం వరకు మెనూలో పెట్టే వివిధ ఆహార పదార్థాలపై జాయింట్ కలెక్టర్ కూలంకషంగా వివరించారు. బ కార్యక్రమంలో డీఈవో జనార్దన్ రెడ్డి, ఎంఈఓ లు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**– ఎంపీ ఆఫీసులో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి**



మనగళం, నంద్యాల : రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రజా పాలన సాగుతోందని టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల జిల్లా ఎస్ పి సునీల్ షారాన్ ను మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బొమ్మలసత్రంలోని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్బంగా బైరెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలో సమస్యలు ఎక్కువ ఉన్నాయని, వాటి పరిస్కారం కోసం కేంద్ర ప్రభుత్వం ఎంపీ నిధులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీ కార్యాలయం వచ్చిన వారి వినతులు ఆయా శాఖ అధికారుల సహకారంతో పరిష్కరిస్తున్నామని, కొన్నింటికి దశలవారీగా పరిష్కారం చూపుతామని బైరెడ్డి హామీ ఇచ్చారు. ప్రజలకు సేవ చేసేందుకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి రాజకీయాల్లోకి వచ్చారని, ఎంపీగా పని వత్తిడి ఎక్కువ ఉన్నా ప్రజలకు అందుబాటులో ఉంటూ శబరి పనిచేస్తున్నారని, ప్రజల దీవెనలు ఆమెకు ఉండాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి, రైల్వే జోనల్ వినియోగదారుల సలహా కమిటీ మెంబర్ ఎ. వెంకటరంగయ్య, బి ఎస్ ఎన్ ఎల్ సలహా కమిటీ మెంబర్ పెరుమాళ్ళ విజయకుమార్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ విజయగౌరి, టీడీపీ నాయకులు భవనశి పుల్లయ్య, కోడూరు సంజీవరెడ్డి, బైరెడ్డి అభిమాన సంఘం నాయకులు గోపాల్ యాదవ్, నందకుమార్ యాదవ్, గోరుకల్లు ఎరుకలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# చిరుధాన్యాల వినియోగంతో అనుకూల మార్పులు

**– జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, డా. ఖాదర్ వలి**





మనగళం, నంద్యాల: చిరుధాన్యాల వినియోగం వల్ల మానవుల ఆరోగ్య జీవనశైలిలో అనేక అనుకూల మార్పులు తీసుకొస్తాయని జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రముఖ ఆహార శాస్త్రవేత్త, మిలెట్స్ మాన్ ఆఫ్ ఇండియాగా పిలువబడే డాక్టర్ ఖాదర్ వలీచే భారతీయ స్టేట్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో చిరుధాన్యాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, పోషక విలువలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ రీజనల్ మేనేజర్ సూర్య ప్రకాష్, డిప్యూటీ జనరల్ మేనేజర్ వి.హేమ, ఆర్ఎఆర్ఎస్ డైరెక్టర్ డా.జాన్సన్, నంద్యాల మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా.సురేఖ, రిటైర్డ్ ప్రొఫెసర్ గంగిరెడ్డి, మిబుల్స్ వ్యవస్థాపకులు ఎ.వి.రామ్ సుబ్బారెడ్డి, ఎస్బిఐ బ్యాంకు సిబ్బంది, ఆరోగ్య అభిలాషులు, గృహిణులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ మాట్లాడుతూ చిరుధాన్యాల వినియోగం ఆరోగ్య పరంగా ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. శారీరక, మానసిక వికాసానికి చిరుధాన్యాలు దోహదపడతాయని చెప్పారు. మిల్లెట్స్‌ను ఆహారంలో చేరుస్తే రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ, జీర్ణక్రియ మెరుగుదల, ఎముకలకు బలాన్నందించడం వంటి ప్రయోజనాలు లభిస్తాయని తెలిపారు. వీటిలో ఫైబర్, ప్రోటీన్, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం వంటి పోషకాలున్నందున మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారికి చిరుధాన్యాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. అంతకుముందు డాక్టర్ ఖాదర్ వలి మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్య రక్షణకు సిరిధాన్యాలే మార్గమన్నారు. సిరి ధాన్యాలు భారతీయ ఆహార వ్యవస్థలో శతాబ్దాలుగా ఉన్న సంప్రదాయ ధాన్యాలు అని, ఆధునిక జీవనశైలి కారణంగా పక్కనపెట్టబడిన ఈ ధాన్యాల పునరాగమనమే భవిష్యత్తు ఆరోగ్య రక్షణకు మార్గమని పేర్కొన్నారు. మధుమేహం, రక్తపోటు, కొవ్వు పెరుగుదల, హార్మోన్ అసమతౌల్యం, హృదయ రోగాలు వంటి అనేక దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించడంలో సిరి ధాన్యాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని శాస్త్రీయ ఉదాహరణలతో వివరించారు. సిరి ధాన్యాల సాగు పర్యావరణానికి అనుకూలమని, తక్కువ నీరు, తక్కువ వ్యయంతో పెంచవచ్చు కాబట్టి రైతులకు ఆర్థికంగా కూడా లాభదాయకమని తెలిపారు. రసాయన ఎరువుల అవసరం లేకుండా సహజ పద్ధతుల్లోనే మంచి ఉత్పత్తి ఇచ్చే ఈ ధాన్యాలను ప్రోత్సహించడం ప్రభుత్వాలూ, రైతులూ, వినియోగదారులూ సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలి అని సూచించారు. మనుషుల ఆరోగ్య శైలి, జీవన విధానాలు, చిరుధాన్యాల ప్రాముఖ్యత పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అదే విధంగా కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులు కూడా చిరుధాన్యాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి వివరించారు. అనంతరం జిల్లా ప్రతీకగా నిలిచిన నంది విగ్రహాన్ని పద్మశ్రీ డా. ఖాదర్ వలికి జాయింట్ కలెక్టర్ అందజేసి శాలువతో సత్కరించారు.


# రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి




మనగళం, నంద్యాల: రహదారి ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు తీసుకుంటే ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని, ఇందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆయన అధ్యక్షతన నిర్వహించిన రహదారి భద్రతా సమావేశం నిర్వహించారు. ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, ఏఎస్పీ యుగంధర్ బాబు, డీఎస్పీ ప్రమోద్ కుమార్, డీటీసీ శివారెడ్డి, ఎన్ హెచ్ , వివిధ శాఖల అధికారులతో రోడ్డు ప్రమాదాలకు తీసుకోవాల్సిన చర్యలపై జేసీ చర్చించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ రహదారి ప్రమాదాల తగ్గింపులో ప్రజల్లో అవగాహన కీలక పాత్ర వహిస్తుందని పేర్కొన్నారు. గత సమావేశంలో కలెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లాలోని నాలుగు సర్వీస్ రోడ్ల వద్ద ఎంట్రీ%-%ఎగ్జిట్ బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు గుర్తు చేశారు. చాపిరేవుల, కోవెలకుంట్ల ప్రాంతాల్లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఇప్పటికే బోర్డులు ఏర్పాటు చేయగా, మిగతా రెండు ప్రాంతాల్లో తక్షణమే ఏర్పాటు చేయాలని ఎన్హెచ్%-%40 అధికారులను ఆదేశించారు. జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్ల వద్ద పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. శాంతిరాం ఆసుపత్రి సమీపంలో రహదారిపై రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసి, అవసరమైన లైటింగ్ పెంచాలని ఆదేశించగా, 10 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని ఎన్హెచ్ అధికారులు తెలిపారు. ఎన్హెచ్%-%44 మార్గంలో డోన్ మండలం, దొరపల్లి గ్రామం వద్ద మెరుగైన విద్యుత్ సదుపాయాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని, ఇందుకు చర్యలు తీసుకుంటున్నామని వారు వివరించారు. బ్రాహ్మణకొట్కూరు ప్రాంతంలో ఎన్హెచ్%-%340సి రహదారి కారణంగా రైతులు సాగు భూములకు వెళ్లడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిపై ప్రజా పరిష్కార వేదికకు అర్జీలు వచ్చినందున వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. రహదారులపై తిరుగుతున్న పాడిపశువులను తొలగించేందుకు పోలీసు శాఖ సహకారంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఎస్పీ యుగంధర్ బాబు మాట్లాడుతూ, రహదారి నిర్మాణ సమయంలో గ్రామాల ఇరువైపుల ప్రజల రాకపోకలకు అనుకూలంగా అండర్‌పాసులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. భారీ వర్షాల ప్రభావంతో దెబ్బతిన్న సర్వీస్ రోడ్లను తక్షణం పునరుద్ధరించాలని ఎన్ హెచ్ అధికారులకు సూచించారు.

# రైతన్న...మీకోసం..

**– ఇకపై రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించదని బెంగ లేదు..**
**– ఈ ప్రభుత్వం రైతులు ప్రభుత్వం...**



నందవరం నవంబర్ 25 మనగళం న్యూస్ : నందవరం మండల పరిధిలోని స్థానిక మాచాపురం గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌లో రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం మరింత దూకుడు పెంచింది. మండల టిడిపి కన్వీనర్ కాసి%శీ%వాలి సొసైటీ బ్యాంక్ చైర్మన్ గోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మరియు ఎమ్మిగనూరు నియోజకవర్గ బి వి జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 24వ తేదీ నుంచి 29వ తేదీ వరకు 'రైతన్నా.. మీ కోసం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా రైతుల ఇళ్లకు నేరుగా వెళ్లి ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు 'పంచసూత్రాల' అమలు ద్వారా కలిగే లాభాలను వివరించనున్నారు. రైతులతోపాటు వారి కుటుంబ సభ్యులకు కూడా ఈ విధానాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకున్నారు. గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యవసాయం, అనుబంధ శాఖలు, మార్కెటింగ్ అధికారులు, సిబ్బందితో కలిపి సుమారు 10 వేల మందితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పంచసూత్రాలు %-% నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు %-% అమలుపై లోతైన చర్చ జరిగింది. రైతు సేవా కేంద్రాల సిబ్బంది ముందుండి ఈ కార్యక్రమాన్ని సఫలీకృతం చేయాలని సీఎం ఆదేశించారు. సీఎం మాట్లాడుతూ గత 17 నెలలుగా రైతులు, వ్యవసాయాన్ని ముందుకు తీసుకొచ్చాం. 'అన్నదాతా సుఖీభవ - పీఎం కిసాన్' కింద 46.50 లక్షల మంది రైతులకు రూ.14 వేల చొప్పున జమ చేశాం. బిందు సేద్యం, పొలం పిలుస్తోంది కార్యక్రమాలతోపాటు ఇప్పుడు పంచసూత్రాలతో రైతులకు మరింత మేలు చేకూరుస్తున్నాం. పాడి, పౌల్ట్రీ, గొర్రెల పెంపకం, ఆక్వా, ఉద్యానవన, సెరికల్చర్ రంగాల రైతులకు కూడా ఈ అవగాహన అందాలి. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి, భూసార రక్షణతోపాటు ఆరోగ్యాన్ని కాపాడాలి. రైతు బజార్లలో ప్రకృతి ఉత్పత్తులకు ప్రత్యేక స్థానం కల్పించాలి" అని పేర్కొన్నారు. పురుగుమందుల అధిక వినియోగం నష్టాలు, సేంద్రీయ విధానం ద్వారా విదేశీ మార్కెట్లలో డిమాండ్, భూసార పరీక్షలు, సమర్థ నీటి నిర్వహణ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు వంటి అంశాలను రైతులకు ఇంటింటా వివరించాలని సీఎం ఆదేశించారు. డిసెంబరు 3న రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్‌షాపులు నిర్వహించి, రైతుల సమస్యలు నేరుగా తెలుసుకునేలా ప్రణాళిక రూపొందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు. పేట టీడీపీ సామిల్. సత్తిరెడ్డి. బడే సాబ్ మరియు గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నారు.



# ఎలక్టర్ల మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయండి

మనగళం, నంద్యాల : పాణ్యం నియోజక వర్గం ఎలక్టర్ల మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని పాణ్యం నియోజకవర్గం ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో పొలిటికల్ పార్టీ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, అలాగే ఫామ్%-%6, 7, 8లకు సంబంధించిన నివేదికలను పూర్తిచేసి ఎన్నికల సంఘానికి పంపినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎలక్టర్ల మ్యాపింగ్ కార్యక్రమంలో పాణ్యం అర్బన్ వార్డు లలో నమోదు శాతం తక్కువగా ఉన్నందున, బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఏ) ఇంటింటికీ వెళ్లి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, పాణ్యం ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ అనురాధ. టీడీపీ ప్రతినిధి నాగేశ్వర్ రెడ్డి, సీపీఎం ప్రతినిధి రామకృష్ణ , బీజేపీ ప్రతినిధి రామ్మోహన్ రెడ్డి, జనసేన ప్రతినిధి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 1 నుంచి కొత్త పన్ను నిబంధనలు

న్యూఢిల్లీ, నవంబర్ 25 , మనగళం, : దేశ ఆదాయపన్ను వ్యవస్థలో భారీ మార్పులకు కేంద్రం శ్రీకారం చుట్టింది. వచ్చే ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి కొత్త పన్ను చట్టం అమల్లోకి రానుండగా, సాధారణ పన్ను చెల్లింపుదారులకు నేరుగా ఉపశమనం చేకూరేలా ప్రభుత్వం పలు కీలక మార్పులను ప్రవేశపెట్టింది. 1961 నుంచి అమల్లో ఉన్న పాత చట్టాన్ని కొత్త చట్టంతో పూర్తిగా మార్చి, పన్నుల వ్యవస్థను మరింత సరళమైనదిగా మార్చడమే లక్ష్యంగా కేంద్రం చర్యలు చేపట్టింది. ఇన్నాళ్లుగా పన్ను చట్టాల్లోని క్లిష్టమైన పదజాలం, అర్థం పట్టు లేని సెక్షన్లతో ఇబ్బందిపడ్డ సామాన్యులకు కొత్త చట్టం పెద్ద ఊరట కలిగించనుంది. సెక్షన్ల సంఖ్యను గణనీయంగా తగ్గిస్తూ, పన్ను చట్ట భాషను సూటిగా, సులభంగా మార్చారు. ఏ ఆదాయం ఏ విభాగంలోకి వస్తుందో తెలుసుకోవడానికి ఇకపై న్యాయపరమైన వ్యాఖ్యానాలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. సాధారణ పన్ను చెల్లింపుదారుడికి కూడా పన్ను చట్టం నేరుగా అర్థమయ్యేలా మార్పులు చేశారు.

మా కలం.. మీ గళం..
మనగళం
దిన పత్రిక

## శనగల బసు అన్నకు విశేష పూజలు



మనగళం శ్రీశైలం : లోక కల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (25.11.2025) ఆలయ ప్రాంగణంలోని నందీశ్వర స్వామికి (శనగల బసవన్న స్వామివారికి) విశేషార్చనలను నిర్వహించనున్నది. ప్రతి మంగళవారం మరియు త్రయోదశి రోజున దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ప్రదోషకాలంలో అనగా సాయం సంధ్యా సమయంలో ఈ విశేషపూజలు నిర్వహించడం జరుగుతోంది. ఈ విశేషార్చనలో ముందుగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్ని ప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖ శాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతుంది. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహా గణపతి పూజను జరిపించబడుతుంది.ఆ తరువాత నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహిస్తారు. తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించబడుతుంది. వృషభసూక్తం మొదలైన వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగుతుంది. తరువాత నందీశ్వరస్వామివారికి నూతనవస్త్ర సమర్పణ, విశేష పుష్పా ర్చనలను చేస్తారు. అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించడం జరుగుతుంది. చివరగా స్వామికి నివేదన సమర్పించబడుతుంది.

## శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి విశేష అభిషేకం



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (25.11.2025) ఉదయం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఈ విశేషఅభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి. కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది. ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించబడింది. అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలైన పాలు,పెరుగు,తేనె,నెయ్యి, కొబ్బరి నీళ్ళు మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వివిధ పండ్ల రసాలతో చేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.

## శ్రీశైలం టోల్గేట్ వద్ద పోలీసులచే కట్టుదిట్టమైన భద్రత





మనగళం శ్రీశైలం : నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ శరన్ ఐపీఎస్ గారి ఆదేశాలు మేరకు ఆత్మకూరు డిఎస్పి శ్రీ రామాంజనేయ నాయక్ గారి సూచనలు మేరకు శ్రీశైల%శీ% మహా పుణ్యక్షేత్రం కు భారతదేశ నలుమూలల నుండి మరియు రెండు తెలుగు రాష్ట్రాల నుండి భక్తులు రావడం జరుగుతుంది కావున శ్రీశైలం ప్రారంభంలోగల శ్రీశైల దేవస్థానం టోల్గేట్ వద్ద శ్రీశైలంలోకి వచ్చే వాహనాలను తనిఖీ చేసేందుకు మరియు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు శ్రీశైలం %జ×% జి. ప్రసాదరావు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. శ్రీశైలం దేవస్థానం టోల్గేట్ వద్ద పోలీస్ సిబ్బంది మరియు శ్రీశైలం దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది 2 సెక్షన్లు గా ఉండి మూడు షిఫ్టులో 24 గంటలు పనిచేస్తూ శ్రీశైల క్షేత్రంలోకి నిషేధిత వస్తువులు అయిన మద్యము, గుట్కాలు, మాంసం రాకుండా చూడడం మరియు ఇతర మతాలకి సంబంధించిన స్టిక్కర్లతో వాహనాలు రాకుండా చూస్తుంటారు.

## బయలు వీరభద్రస్వామికి ప్రదోషకాల అభిషేకం



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (25.11.2025) సాయంకాలం శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీబయలు వీరభద్రస్వామివారికి విశేషపూజలను జరిపించనున్నది. ప్రతీ మంగళవారం మరియు అమావాస్యరోజులలో బయలువీరభద్రస్వామివారికి ఈ విశేష అభిషేకం, అర్చనలను నిర్వహించబడుతున్నాయి. బయలువీరభద్రస్వామివారు శివభక్తగణాలకు అధిపతి. అదేవిధంగా శ్రీశైలక్షేత్రపాలకుడుగా క్షేత్రానికి ఆరుబయట ఉండి, ఎటువంటి ఆచ్ఛాదన, ఆలయం లేకుండగా బయలుగా దర్శనమిస్తాడు కనుక ఆయనకు బయలువీరభద్రస్వామి అని పేరు వచ్చింది. ప్రసన్నవదనంతో కిరీట మకుటాన్ని కలిగి దశభుజుడైన స్వామివారు పది చేతులలో వివిధ ఆయుధాలతో దర్శనమిస్తాడు. స్వామివారికి క్రిందివైపున కుడివైపు దక్షుడు, ఎడమవైపు భద్రకాళి దర్శనమిస్తారు. ఈ స్వామిని దర్శించినంత మాత్రానే ఎంతటి క్లిష్ట సమస్యలైనా తొలగిపోతాయని, వ్యాధులు నశించి ఆయురారోగ్యాలు చేకూరుతాయని ప్రసిద్ధి. ముఖ్యంగా ఆగమసంప్రదాయంలో క్షేత్రపాలక పూజకు చాలా విశేషస్థానం ఉంది. క్షేత్ర పాలకుడికి పూజలు చేయడం వలన ఆ క్షేత్రంలో ఉన్నటువంటి భక్తులు ఎటువంటి భయం,బాధలు లేకుండా సుఖసంతోషాలతో ఉంటారు. మంగళవారం, ఆదివారం మరియు అమావాస్య రోజులలో చేసే వీరభద్రపూజ అనేక ఫలితాలు ఇస్తుందని ఆగమశాస్త్రాలు చెబుతున్నాయి. ఈ స్వామిపూజతో సకలగ్రహ అరిష్టదోషాలు, దుష్టగ్రహపీడలు తొలగిపోతాయి. అదేవిధంగా సంతానం, ఐశ్వర్యం మొదలైన అనేక శుభఫలితాలు చేకూరుతాయి. ఈ పూజాదికాలలో పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించడం జరుగుతుంది.

## సాంస్కృతిక కార్యక్రమాలు




మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈరోజు ( 24.11.2025) డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, మంగళగిరి, గుంటూరు జిల్లా వారిచే శ్రీశైల తీర్థసారము %-% విశేషాలపై ప్రవచన కార్యక్రమం నిర్వహించబడుతున్నది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజనిలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీ స్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

## ప్రతి రైతుకు అండగా ఉంటాం.

**– ఆలూరు టీడీపీ ఇంచార్జి వైకుంఠం జ్యోతి.**






( ఆలూరు మనగళం ): ఆలూరు మండలం, హులేబీడు గ్రామంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆలూరు టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి పాల్గొన్నారు. ఆమె గ్రామంలో పర్యటించి రైతులు కు అన్నదాత సుఖీభవ పథకం రైతులకు అందిందా, లేదని రైతుల ఇంటింటికి వెళ్లి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎన్డీఏ కూటమి ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు వివరిస్తూ, గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తారని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ, రెండో విడత గా కూటమి ప్రభుత్వం ఆలూరు నియోజవర్గం 63, 317 రైతులకు , ఒక్కో రైతుకు7000 చొప్పున మొత్తం 42 కోట్లు కూటమి ప్రభుత్వ ఇచ్చిందని తెలియజేశారు. గత వైయస్సార్ ప్రభుత్వం 15 వేలరూపాయలు ఇచ్చిందని, రైతులు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం 20000 రూపాయలు పెంచి రైతులకు అందిస్తుందన్నారు. అలాగే రైతుల పండించిన పత్తి కు కూడా సీసీఐ ద్వారా 8,100 రూపాయలకు కొని గిట్టుబాటు ధర కల్పిస్తుంది అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ ఆశీస్సులతో, త్వరలోనే నియోజకవర్గంలో అన్ని గ్రామాల ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ఇంటింటికి మీ వైకుంఠం జ్యోతి అనే కార్యక్రమంతో మీ ముందుకి వస్తానని నన్ను ఆశీర్వదించండి టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వైకుంఠం అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు



మనగళం, కర్నూలు క్రైం : జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టారు. ఈ మేరకు మంగళవారం రాజ్ విహార్ సర్కిల్ ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాలకు సంబంధించి వీడియోలు ప్రదర్శించారు. రోడ్డు ప్రమాదాల మూలంగా జరిగే నష్టాలను ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ వివరించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

## కోడుమూరు మండలంలో రైతన్న మీకోసం కార్యక్రమం



మన గళం కోడుమూరు: కోడుమూరు మండలంలోని ప్యాలకుర్తి మరియు వెంకటగిరి మరియు వర్కూరు గ్రామాలలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించబడినది ఈ కార్యక్రమానికి పరిశీలించడం కొరకు కర్నూల్ డివిజన్ ఏడి ఏ ఎన్ సాలు రెడ్డి మరియు మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్ మరియు వర్కూరు గ్రామంలో టిడిపి మండల కన్వీనర్ ఎల్ రామకృష్ణారెడ్డి మరియు రవీంద్ర గౌడ్ మరియు ఆయా గ్రామాల ప్రజలతో రైతులతో వారి వారి ఇంటి దగ్గర మరియు రచ్చకట్టల దగ్గర రైతన్న మీకోసం కార్యక్రమం వివరించి వారికి కార్యక్రమం గురించి క్లుప్తంగా తెలియజేశారు

రైతన్న మీకోసం కార్యక్రమంలో పంచ సూత్రాలను స్థానిక రైతులకు వ్యవసాయ అధికారులు వివరించి చెప్పారు కోడుమూరు మండలంలోని ప్రతి గ్రామంలో రైతు సేవా కేంద్రం సిబ్బందితోపాటు అనుబంధ శాఖల అధికారులు వారి ఇంటి దగ్గరికి వెళ్లి వారికి కావలసినటువంటి పథకాలను రైతులకు తెలియపరుస్తూ అవసరమైనటువంటి వాటిని తెలుసుకొని అప్లో ఎంట్రీ చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు ప్రతి ఒక్క రైతు ఇంటి దగ్గరికి వెళ్లి రైతులతో వారి వారి ఇంటి దగ్గర రైతులతో కలిసి వ్యవసాయ అధికారులు చర్చించుకున్నారు ఇందులో భాగంగా రైతులకు డ్రిప్పు ఏమైనా అవసరం ఉన్నదా మరియు పాడి పరిశ్రమకు సంబంధించి ఏదైనా వారి అవసరాలను అధికారులు తెలుసుకున్నారు అలాగే హార్టికల్చర్ డిపార్ట్మెంట్ కి సంబంధించి పండ్ల తోటలకి వారికి అవసరమైన విషయాలు తెలియజేశారు అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకాలు అందుతున్నవా లేదా రైతులను వ్యవసాయ అధికారులు అడిగి తెలుసుకున్నారు రసాయనకేరువులను తగ్గించి సేంద్రియ వ్యవసాయం సైడు రైతును వెళ్లేటట్టు రైతులకు తగు సూచనలు ఇచ్చారు అలాగే మారుతున్న కాలానికి అనుగుణంగా డ్రోన్లు మరియు సాంకేతిక పరిజ్ఞానం రైతులకు వాటిని ఉపయోగించుకునే విధానాన్ని గురించి తెలియజేశారు.



# ఆలయ గోపురం నిర్మాణం కోసం భూమి పూజ..




నందవరం, నవంబర్ 25 మనగళం న్యూస్ : మండల కేంద్రమైన నందవరం గ్రామంలో వెలసిన శ్రీ మాతా బంగారమ్మ అవ్వ దేవాలయ గోపురం నిర్మాణం కోసం మంగళవారం గ్రామ పెద్దలు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో పురోహితులు సూగూరు గోపాల్ స్వామి ద్వార ఆలయ కార్య నిర్వాహకలు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహకులు మాట్లాడుతూ ఆలయ గోపురం నిర్మాణానికి దాదాపుగా 12 నుంచి 15 లక్షల దాకా ఖర్చు రావచ్చని అంచనా వేశామన్నారు అన్నారు. అంతేకాకుండా ఇటీవల ఐదు లక్షల వ్యయంతో కుమ్మరి వీధి దగ్గర శ్రీ మాతా బంగారమ్మ అవ్వ దేవాలయ ముఖ ద్వారం నిర్మించడం జరిగిందని తెలిపారు. అమ్మవారి గోపుర నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భక్తులు స్వచ్ఛందంగా ముందుకి వచ్చి విరాళాలు ధన, వస్తురూపేనా ఏ విధంగా అందించిన స్వీకరిస్తామని వారన్నారు. అమ్మవారి గోపురం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములై అమ్మవారి కృపా కటాక్షాన్ని పొందాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పురోహితులు గోపాల్ ఆలయ పూజారి సంజీవ నాయుడు, ఆలయ పెద్దలు దేవుళ్ళ పెద్ద రామన్న, చుక్క మల్లేష్, ఒంటెద్దు మల్లేష్, యన్ లింగమూర్తి, వీరేష్, గడ్డం చిన్న రాముడు, రాజోలి భీమశేఖర్, బండెడ్డి రాజు, పూజారి బంగారి, దండు నాగరాజు, రాజోలి నాగేష్, గుంటెప్ప, గుడిసి రాముడు, గడ్డం నాగప్ప , మాలే గురు రాజ్, వడ్డే గోపాల్ తదితరుల తో పాటు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆలూరు అభివృద్ధే మా ధ్యేయం.



( ఆలూరు మనగళం ): ఆలూరు మండల కేంద్రంలో ప్రభుత్వ సామజిక ఆరోగ్య నూతన భవనాన్ని ప్రారంభించిన, ఆలూరు టీడీపీ ఇంచార్జి వైకుంఠం జ్యోతి. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితులుగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మరియు ఆలూరు ఎమ్మెల్యే బూసినె వీరుపాక్షి పాల్గొన్నారు. సందర్భంగా మాట్లాడుతూ ఆలూరులో ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవనాలు ప్రారంభించడం శుభపరిణామం అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతో చర్చించి ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాను అని తెలిపారు. అనంతరం ఆలూరులో ముక్యంగా నాలుగు సమస్యలు వైద్యం, విద్య, మౌలిక సదుపాయాలలో భాగంగా రోడ్లు మరియు ముక్యంగా రైతులకు వేదావతి నిర్మాణం విటన్నిటిమిద సిఎం ద్రుష్టికి తీసుకెళ్ళాను, మరొకసారి సిఎం కు వివరించి, ఆలూరు అభివృద్ధికి నావంతు కృషి చేస్తానని తెలిపారు. ఆలూరు ఇంచార్జి వైకుంఠం జ్యోతి మాట్లాడుతు ఆలూరులో ప్రభుత్వ సామజిక ఆరోగ్య 30 పడకల సి హెచ్ సి నూతన భవననిర్మాణం రూ.273.00 లక్షలుతో వెచ్చించి, అభివృద్ధితో నూతన భవనాన్ని ప్రారంభించడం సంతోషకరంగా ఉంది అన్నారు. చరిత్రలో ఎన్నడూ జరగని పనులు ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో జరగడం హర్షించ దగ్గ విషయం అన్నారు. ఆలూరులో గైనాలజిస్ట్ డాక్టర్ లేకపోవడతో గర్భిణీ స్త్రీలు ఎంతో ఇబ్బందులకు గురికావడం, చాలా బాధాకరం, త్వరలోనే సిఎం మరియు ఆరోగ్య శాఖ మంత్రి ద్రుష్టికి తీసుకెళ్లి, ఈ సమస్యకు పరిష్కారం చేస్తానని జ్యోతి హామీ ఇచ్చారు. ఆలూరు నియోజకవర్గంలో ప్రజలు వైకుంఠం కుటుంబాన్ని ఆదరిస్తే, నియోజకవర్గ అభివృద్ధి చేసి, ప్రజలకు అంకితం చేస్తాము అన్నారు. అలాగే 30 పడకల నుండి 50 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి ఆలూరు నియోజకవర్గ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడమే, మా ధ్యేయం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, మార్కెట్ యార్డ్ చైర్మన్ బిల్లేకల్ వెంకటేష్, జనసేన ఐటీ కోఆర్డినేటర్ రంజిత్ కుమార్, బీజేపీ నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, వైకుంఠం అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# రామ తారకమంత్రం భక్తిముక్తిసాధకం




మనగళం, ఆస్పరి : మనందరిలో రమించే దివ్యచైతన్యమే శ్రీరామచంద్రుడని, రామనామ స్మరణ సకల మానవులకు ఇహపరసాధకమని, భక్తి, ముక్తి సాధకమని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆస్పరి మండలం, కారుమంచి గ్రామంలోని శ్రీజ్యోతి మూర్తి సిద్ధాశ్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానములు ఏర్పాటు చేసిన ధార్మిక కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రసిద్ధ నాటకరంగ కళకారులు పాయసం పెద్దరంగారెడ్డి శ్రీమద్రామాయణంలోని ఆదర్శ గుణాలగురించి ప్రవచించారు. కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార మండల సభ్యులు న్యాయకంటి భీమిరెడ్డి, సోమేశ్వరరెడ్డి,కాపు రవిప్రకాశ్ రెడ్డి,శివయ్య, జె. సత్యనారాయణరెడ్డి, కె. ఈరన్న, యం. తిమ్మప్ప, జయకృష్ణ, రంగస్వామి, సుధాకర్, సిద్ధప్ప బీరప్ప, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.


# కర్నూలు డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకోండి

**– ఏఐసీసీ అబ్జర్వర్ హెచ్ సి యోగేష్**

మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు జిల్లాలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు లేనందున పార్టీ శ్రేణులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని కాంగ్రెస్ కేంద్ర కమిటీ పరిశీలకులు ఏఐసిసి కార్యదర్శి హెచ్ సి యోగేష్ సూచించారు. కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏపీసీసీ అబ్జర్వర్లు సాకే శంకర్, సొంటి నాగరాజుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యోగేష్ మాట్లాడారు. కొత్త డీసీసీని ఎన్నుకొనుటకు కాంగ్రెస్ పార్టీ మంచి అవకాశం కల్పించిందని, కాంగ్రెస్ పార్టీలో అర్హులైన వారు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు వెళ్లి నాయకులను కలుస్తామన్నారు. ప్రతి ఒక్క కాంగ్రెస్ మెంబర్ను, గ్రామస్థాయి, మండల స్థాయి, జిల్లా స్థాయి నాయకులను కలుస్తామన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, చైర్మన్లు, మాజీ ప్రజా ప్రతినిధులను అనుబంధ సంఘాల నాయకులను కలుస్తామని చెప్పారు. పీసీసీ, డీసీసీలో పనిచేసిన పాతవారిని కలుస్తామని, ఐదవ తేదీ లోపు డీసీసీ అధ్యక్ష పదవి ఆశించి అభ్యర్థులకు ఎంతమంది బలపరుస్తున్నారనే నివేదికను అధిష్టానానికి పంపిస్తామన్నారు. కర్నూలు డిసిసి కార్యాలయంలో కోఆర్డినేటర్లను అనుబంధ సంఘాల అధ్యక్షులను మండల కాంగ్రెస్ అధ్యక్షులను కలిసి వారి అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. రేపటి నుండి నియోజకవర్గాల పర్యటన ఉంటుందని, ప్రతిరోజు రెండు అసెంబ్లీ నియోజకవర్గాలు పర్యటిస్తామని చెప్పారు. ప్రతిరోజు నివేదిక కేంద్ర కార్యాలయానికి పంపిస్తామని, నాలుగు రోజులలో జిల్లాలోని నియోజకవర్గాలన్నీ పర్యటిస్తామన్నారు. 28 వ తేదీ వరకు కర్నూల్ డీసీసీ అధ్యక్షుడి నియామకానికి అందరి అభిప్రాయాల మేరకు అధిష్టానం కొత్త డీసీసీని నియమిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఏఐసీసీ సభ్యులు ఎం సుధాకర్ బాబు, మాజీ డీసీసీ అధ్యక్షులు కే బాబురావు, యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి జి నాగ మధు యాదవ్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని బాషా, ఐఎన్టీయూసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి బాషా, ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాల కోఆర్డినేటర్లు ఎం కాశీం వలి, బి క్రాంతి నాయుడు, అనంతరత్నం మాదిగ, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎస్సీ బజారన్న, ఓబీసీ సెల్ చైర్మన్ డీవీ సాంబశివుడు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బి మహేంద్ర నాయుడు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఏ సూర్య ప్రకాష్ రెడ్డి, ఎన్ ఎస్ యు జిల్లా అధ్యక్షులు జి వీరేష్ యాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై మారుతీ రావు, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగిడాల ఆమానుల, డాక్టర్ సుభాన్ ఏసీ సెల్ మాజీ మాజీ అధ్యక్షులు ఈ లాజరస్, డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శులు దిలీప్ డొక, సయ్యద్ నవీద్ రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.




# చెన్నకేశవ స్వామి సేవలో ఆలూరు ఎమ్మెల్యే వీరుపాక్షి.



( ఆలూరు మనగళం ): ఆలూరు నియోజకవర్గం, మొలగవల్లి గ్రామంలో స్థానికంగా వెలసిన శ్రీ చెన్నకేశవ స్వామి వారి రథోత్సవం సందర్భంగా ఆలూరు ఏమ్మెల్యే బుసినే విరుపాక్షి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సందర్బంగా వీరుపాక్షి మాట్లాడుతు, ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలి అని కోరారు. అనంతరం శ్రీ చెన్నకేశవ స్వామి వారిని దర్శించుకొని, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి, వైస్సార్సీపీ మండల కన్వీనర్, ఎంపీపీ, సర్పంచ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గం కార్యవర్గ సభ్యులు, మండల కార్యవర్గ సభ్యులు, వైస్ ఎంపీపీలు ఎంపీటీసీలు, కో కన్వీనర్, వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, బీవీర్ అభిమానులు పాల్గొన్నారు.



# కోడుమూరు మండల అభివృద్ధి కొరకై నిధులు కేటాయించాలి పిఎస్ రాధాకృష్ణ

మన గళం కోడుమూరు: కోడుమూరు మండలంలోని అన్ని గ్రామాలకు గాజులదిన్నె ప్రాజెక్టు మరియు ఎల్ ఎల్ సి కెనాల్ ద్వారా సాగు త్రాగునీరు అందించాలని అలాగే మండల అభివృద్ధి కొరకు నిధులు కేటాయించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ మండల కార్యదర్శి కే రాజు సారధ్యంలో జీపు జాత ప్రారంభించడం జరిగింది . ఈ జీపు జాతను ప్యాలకుర్తి గ్రామంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూల్ పార్లమెంటు అత్యధికంగా వెనుకబడి ఉంది ఉమ్మడి కర్నూలు జిల్లాలో నంద్యాల కలిసి ఉన్నప్పుడు ఒక రకంగా ఉండేది ఇప్పుడు నంద్యాల జిల్లా విడిపోయిన తర్వాత కర్నూల్ పార్లమెంటు ఎడారిగా మారిపోయింది పక్కనే తుంగభద్ర ఇటుపక్క హంద్రీ నది ఉండి కూడా సాగునీరు పక్కన పెడితే కనీసం తాగునీరైనా సరే దొరికే పరిస్థితి చాలా దారుణంగా ఉంది చాలా గ్రామాలు ఇప్పటికీ త్రాగునీటి కొరకు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి గత ప్రభుత్వాలు ప్రస్తుత ప్రభుత్వం కర్నూల్ పార్లమెంటును అభివృద్ధి చేస్తామని ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చారు ఆలూరు ప్రాంతంలో వేదవతి ప్రాజెక్టు నత్తనడకన నడుస్తుంది సంపూర్ణమైనటువంటి నిధులు లేక ఆ ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నది తుంగభద్ర నదిపై బ్రిటిష్ కాలంలో నిర్మించినటువంటి ఆర్డిఎస్ ఆనకట్టద్వారా గత 60 సంవత్సరాల నుండి తెలంగాణ ప్రభుత్వం పుష్కలంగా నీళ్లు వాడుకుంటుంది కానీ మన కర్నూలు జిల్లా దరిద్రం ఆర్డీఎస్ కుడికాల నుండి నీళ్లు వాడుకోవడానికి అనుమతులు ఉన్న ఆ కుడికాలువను పూర్తి చేయడంలో ఈ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి అలాగే కర్నూల్ జిల్లా కేంద్రానికి అతి దగ్గరలో ఉన్నటువంటి కోడుమూరు నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోవడం లేదు . స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలుగా వస్తున్న కనీసం మండల కేంద్రమైన కోడుమూరులో శాశ్వత త్రాగునీటి పరిష్కారం చేయడంలో విఫలం అయిపోయారు మన పాలకులు పక్కన హంద్రీ నది నెత్తిన గాజులదిన్నె ప్రాజెక్టు ఇటు తుంగభద్ర ఉన్న కోడుమూరు ప్రాంతానికి సాగు త్రాగునీరు రావడం లేదు కోడుమూరు నియోజకవర్గం ఎస్సీ నియోజకవర్గం రాజ్యాంగం ప్రకారం ఎస్సీ నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయించాలి అలాంటిది నియోజకవర్గం గురించి ఏ ప్రభుత్వాలు కూడా అభివృద్ధి చేయడం లేదు కోడుమూరులో విద్యార్థులు డిగ్రీ చదవాలి అంటే ప్రైవేటు విద్యాసంస్థలను ఆశ్రయించాల్సి ఉంది ఎంతోకాలంగా డిగ్రీ కళాశాల కళాశాల కావాలని అడుగుతున్న పట్టించుకోవడం లేదు కోడుమూరు ప్రాంతంలో పరిశ్రమలకు అనుకూలమైన భూములు వనరులు ఉన్నాయి మనలను పాలించే పాలకులకు చిత్తశుద్ధి లేక అన్యాయం జరుగుతుంది గ్రామీణ ప్రాంతాల విషయానికొస్తే డ్రైనేజీలు సిసి రోడ్లు లేక చాలా గ్రామాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి ఎర్రదొడ్డి గ్రామంలో విశాలమైనటువంటి చెరువు ఉన్నది ఆ చెరువును 10 అడుగుల లోతు మట్టి తీసీ ఎల్ ఎల్ సి ద్వారా నీళ్లు నింపితే భూగర్భ జలాలు పెరిగి చుట్టుపక్కల ఉన్నటువంటి గోరంట్ల చిల్లబండ ఎర్రదొడ్డి ప్రాంతాల పొలాలకు మంచి సౌకర్యంగా ఉంటుంది కృష్ణాపురం దగ్గర ఉమ్మడి రాష్ట్రంలో స్టీల్ ప్లాంట్ కొరకు భూమిని సేకరించారు కానీ రాష్ట్రం విడిపోయాక ఆ భూమి గురించి గానీ అక్కడ రావాల్సిన పరిశ్రమ గురించి గానీ పాలకులు పట్టించుకోవడం లేదు ఆ భూమిలో అలాగే గోరంట్ల గ్రామంలో హంద్రీ నదిపై నిర్మాణంలో ఆగిపోయిన బ్రిడ్జిని పూర్తిచేస్తే క్రిష్ణగిరి వెల్దుర్తి మండలాల నుండి కోడుమూరు మీదుగా ఆదోని మంత్రాలయం రాయచూరు లాంటి ప్రాంతాలకు వెళ్లడానికి ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది ఆ బ్రిడ్జి నిర్మాణంలో ఆగిపోవడం వల్ల వర్షాకాలంలో హంద్రీ నదికి నీళ్లు వదిలితే అవతలి గట్టుకు వెళ్లలేరు గోరంట్ల గ్రామానికి చెందిన చాలామంది రైతులకు అవతలి వైపు పొలాలు ఉన్నాయి వెళ్లడానికి చాలా ఇబ్బందిగా ఉంటుంది ఇలా గ్రామాల వారీగా ఎన్నో సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి ఈ సమస్యల పరిష్కారం కొరకు దాదాపు 33 డిమాండ్స్ తో ఈ జీపు జాత ప్రజల ముందుకు వెళ్లడం జరిగింది ఈ జాత ప్యాలకుర్తిలో ప్రారంభమై అమడగుంట్ల చిల్లబండ అనుగొండ లద్దగిరి గోరంట్ల వెంకటగిరి మీదుగా కోడుమూరు కృష్ణాపురం వర్కూరు కల్లపరిమీదుగ పులకుర్తిలో ముగించడం అయినది గ్రామాలలో ఉన్న సమస్యలన్నిటిని తీసుకొని డిసెంబర్ ఒకటో తేదీన తాసిల్దార్ కార్యాలయం నందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నామని వారన్నారు ఈ కార్యక్రమంలో గఫూర్ మియా జీపీ వీరన్న కే లక్ష్మన్న కుమారస్వామి కొత్తూరు శ్రీనివాసులు మల్లికార్జున గిడ్డయ్య పాల్గొన్నారు.



# అనుగొండ మరియు ఎర్రదొడ్డి గ్రామపంచాయతీలను ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ

మన గళం కోడుమూరు: కోడుమూరు ఎంపీడీవో ఏసీ రాముడు అనుగొండ గ్రామపంచాయతీ మరియు ఎర్రదొడ్డి గ్రామ పంచాయితీలను సందర్శించి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు గ్రామ సచివాలయంలో పెండింగ్ ఉన్నటువంటి అప్డేట్ ఈ కేవైసీ, మ్యాండేటరీ బయోమెట్రిక్ అదేవిధంగా కౌశలం ,వాహన్ సీడింగ్ మొదలైనటువంటి సర్వేలకు సంబంధించి పెండింగ్ ను వెంటనే క్లియర్ చేయవలసిందిగా పంచాయతీ కార్యదర్శులకు సచివాలయం సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు అలాగే సచివాలయం సిబ్బంది యొక్క పర్ఫామెన్స్ ను తనిఖీ చేశారు. అదేవిధంగా ఎర్రదొడ్డి గ్రామపంచాయతీలో ఎస్డబ్ల్యుపిసి ఫంక్షన్ ఇన్ లోకి తెచ్చుకోవడానికి వెంటనే కచ్చితంగా కృషిచేసి రాబోయే 15 రోజులలో పూర్తి ఫంక్షన్లకు తీసుకురావాలని ఈ సందర్భంగా వారు ఆదేశించారు అదేవిధంగా అనుగొండ గ్రామపంచాయతీలో రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొని రైతులతో మాట్లాడి ప్రభుత్వము చేపడుతున్నటువంటి ముఖ్యమైనటువంటి అంశాలు రైతులకు ఇచ్చేటువంటి సలహాలను స్వీకరించాలని అదేవిధంగా సర్వే కూడా సహకరించాలని ఫార్మర్స్ కు అదే విధంగా టీమ్ మెంబర్స్ కి కూడా సర్వే త్వరగా పూర్తి చేయాలని వారు స్థానిక సిబ్బంది ఆదేశించారు.




Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP. Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.